teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 47 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 22 జూలై 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## భారత ఉపరాష్ట్రపతి రాజీనామా



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జగదీప్ ధన్‌ఖర్ కృతజ్ఞతలు

దేశ ఉజ్వల భవిష్యత్‌పై పూర్తి నమ్మకం ఉంది

రాజీనామా సందర్భంగా ఉపరాష్ట్రపతి వాఖ్యలు

02




కేరళ మాజీ సీఎం మృతి పట్ల కేటీఆర్, హరీష్ రావు

## సంతాపం

కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్

.. వివరాలు 2లో



## ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసీలకు శుభవార్త

కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్ జీవో 49 నిలుపుదల

ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులు ఆదేశాలు జారీ

.. వివరాలు 2లో



# గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ

వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు


ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటుకు యోచన

ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలకు సూచన


ప్రభుత్వ నూతన పాలసీపై సమీక్షా సమావేశం

సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం

తెలంగాణలో స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు, ఓలా, ఉబర్ వంటి రైడ్- షేరింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, అలాగే ఇతర ఆన్‌లైన్ సేవల్లో వేలాది మంది గిగ్ వర్కర్లు పనిచేస్తున్నారు. వీరు తమ నైపుణ్యాలను ఉపయోగించుకుని, స్వల్పకాలిక ప్రాజెక్ట్‌లు లేదా టెంపరరీ పనుల ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారు. అయితే, వీరికి సంప్రదాయ ఉద్యోగులకు లభించే సామాజిక భద్రత, బీమా వంటి ప్రయోజనాలు ఉండవు. ఈ నేపథ్యంలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది.



## హెచ్సీఏ అక్రమాలలో బీఆర్ఎస్ ప్రమేయం




కేటీఆర్, కవితపై గురువారెడ్డి సంచలన ఆరోపణలు

గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం

నిధుల గోల్ మాల్‌పై ప్రశ్నలు

విజిలెన్స్, సీఐడీ దర్యాప్తు

బయటపడిన ఫేక్ క్లబ్‌ల వ్యవహారం

హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ గురువారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హెచ్సీఏ

మిగతా 2 లో

## గూగుల్, మెటాకు ఈడీ మరోసారి సమన్లు

జూలై 21న గైర్హాజరు, 28న హాజరు కావాలని ఆదేశాలు

బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సహకరించారనే ఆరోపణలు

ప్రముఖ సెలబ్రిటీలపై ఈడీ కేసు నమోదు

రానా, విజయ్ దేవరకొండ సహా 29 మందిపై ఆరోపణలు



02



## డయాలసిస్ పేషంట్లకు సర్కార్ తీపికబురు

కొత్తగా 681 మంది పేషంట్లకు చేయూత పించన్లు మంజూరు

సంబంధింత ఫైల్ పై సంతకం చేసిన మంత్రి సీతక్క

హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): డయాలసిస్ పేషంట్లకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొత్తగా మరో 681 మంది డయాలసిస్ పేషంట్లకు చేయూత పించన్లు మంజూరు

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు

కీలక ప్రకటన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఈ మేరకు కలెక్టర్లకు కీలక ఆదేశాలు జారీ

సచివాలయం వేదికగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. సోమవారం సచివాలయం వేదికగా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ

మిగతా 2 లో



## వరల్డ్ కప్ సెమీస్‌లో అడుగుపెట్టిన తొలి ఇండియన్

ఫిడే వరల్డ్ కప్‌లో సెమీ ఫైనల్‌కు చేరిన కోనేరు హంపి

ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి కోనేరు హంపికి అభినందనలు

.. వివరాలు 2లో

## ఏటీసీల అభివృద్ధిని వేగవంతం చేయండి



02

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణకు సూచన

ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానన్న సీఎం

రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీల అభివృద్ధి



02

## ఇక్కడ ఎకరం భూమి అమ్మితే ఏపీలో పది ఎకరాలు వచ్చేది

ఇక్కడ రేవంత్ రెడ్డి అక్కడ చంద్రబాబు వచ్చాక సీన్ రివర్స్

మాజీ మంత్రి హరీశ్ రావు హాట్ కామెంట్స్

## నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో మరో బస్టాండ్



02

అందుబాటులోకి తెచ్చేందుకు యోచనలో సర్కార్

ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం స్పష్టం

## ఎస్ఎల్‌బీసీలో పనులు పూర్తికి ప్రభుత్వం కసరత్తు

డెన్మార్క్ నుంచి తెప్పించిన ఎలక్ట్రో మాగ్నటిక్ పరికరాలు

హెలికాప్టర్లు, లైడార్ సర్వేల సహాయంతో పరిశీలన

150 రోజులు పూర్తి ఐన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం



02

## దేశవ్యాప్తంగా వాతావరణ సూచన

02

# గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక పాలసీ

తెలంగాణ బ్యూరో, జూలై 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రతిపాదిత నూతన పాలసీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో కూలంకషంగా సమీక్షించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి గారితో పాటు, మంత్రి వివేక్ వెంకటస్వామి కూడా పాల్గొన్నారు. గిగ్ వర్కర్ల భవిష్యత్తుకు భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక నిధిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ సంక్షేమ నిధి ద్వారా వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా వంటి కీలకమైన సౌకర్యాలను కల్పించే విధంగా పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇది గిగ్ కార్మికులకు పని ప్రదేశంలో ఎదురయ్యే ప్రమాదాల నుండి, అలాగే ఆరోగ్య సమస్యల నుండి ఆర్థిక భద్రతను అందిస్తుంది. గిగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించడానికి, వారి సంక్షేమాన్ని పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేకమైన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ బోర్డుకు ప్రభుత్వ ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పారదర్శకతను పెంచడం మరియు గిగ్ వర్కర్ల గురించి సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచడం కోసం, గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఈ సమావేశం ద్వారా స్పష్టమైంది. ఈ నూతన పాలసీ అమలులోకి వస్తే, గిగ్ వర్కర్ల జీవితాల్లో గణనీయమైన సానుకూల మార్పులు వస్తాయని ఆశిద్దాం.





# ఇక్కడ ఎకరం భూమి అమ్మితే ఏపీలో పది ఎకరాలు వచ్చేది



గజ్వేల్, జులై 21 (తీన్మార్ న్యూస్): ఒకప్పుడు తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఏపీలో పది ఎకరాల భూమి వచ్చేది. కానీ, ఇక్కడ రేవంత్ రెడ్డి అక్కడ చంద్రబాబు వచ్చాక సీన్ రివర్స్ అయిందని మాజీ మంత్రి హరీశ్ రావు హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో ఎకరా భూమి అమ్మితే తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ కు పాలన చేతకాక తెలంగాణలో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. సోమవారం ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. పెండ్లి కోసమో, చదువుల కోసమో భూములు అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. ఇంకో రెండు ఏళ్లు కాంగ్రెస్ పాలన ఉంటే భూముల రేట్లు సగానికి సగం అవుతాయన్నారు. ప్రజలందరూ కేసీఆర్ మళ్లీ రావాలని, సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం, రాష్ట్రంలో 31 జిల్లా పరిషత్‌లు ఉంటే 16-18 పరిషత్‌లు బీఆర్ఎస్ సొంతం చేసుకోబోతోందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 26 మండలాలు ఉంటే, మెజార్టీ మండలాల్లో గెలవాల్సిన అవసరం ఉందని అన్నారు. అందరం కలిసి ఒక కుటుంబం లాగా పనిచేయాలని సూచించారు. ఎట్లుండె తెలంగాణ ఎట్ల అయ్యింది అనేది ప్రజలకు అర్థం అయ్యేటట్లు చెప్పాలని సూచనలు ఇచ్చారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు అని మాట తప్పారని ఆరోపించారు. 12 వేల ఉద్యోగాలు ఇచ్చి, 60 వేలు ఇచ్చినం అని అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నరని, కేసీఆర్ లక్షా 68 వేల ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడానికి అశోక్ నగర్‌లోని విద్యార్థులు, నిరుద్యోగులు సిద్ధమయ్యారని వెల్లడించారు. రాహుల్ గాంధీ పత్తా లేడు, రేవంత్ రెడ్డి పోలీసు వలయం పెట్టుకొని తిరుగుతున్నారని విమర్శలు చేశారు. కాంగ్రెస్ వచ్చింది మళ్లీ రైతులకు తిప్పలు మొదలైనాయన్నారు. యూరియా కోసం పాస్ పుస్తకాలు, చెప్పులు లైన్లో పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఏనాడైనా ఎరువుల కోసం లైన్ల నిలబడ్డరా? అని ప్రశ్నించారు. కరోనా వచ్చినా కూడా కేసీఆర్ గారు రైతుబంధు ఆపలేదని గుర్తుకు చేశారు. కానీ, ఇప్పటికే రెండు సీజన్ల రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు.

# వరల్డ్ కప్ సెమీస్‌లో అడుగుపెట్టిన తొలి ఇండియన్



హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. వరల్డ్ కప్‌లో సెమీస్‌లో అడుగుపెట్టిన తొలి ఇండియన్‌గా ఘనత సాధించింది. ఈ మేరకు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపిపై భారత్‌లోని ప్రముఖులు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి కోనేరు హంపికి అభినందనలు తెలిపారు. 'ఎఫ్ఐడీఈ ఉమెన్స్ వరల్డ్ కప్ సెమీ ఫైనల్‌కు చేరిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి నా ప్రత్యేక అభినందనలు. ఈ లీగ్‌లో చేరిన తొలి భారతీయ మహిళ కోనేరు హంపి కావడం తెలుగు ప్రజలకు గర్వకారణం. ఆమె విజయం సాధించాలని మనసారా కోరుకుంటున్నాను' అని విషెస్ తెలిపారు. కాగా, ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో కోనేరు హంపి 1.5-0.5 తేడాతో చైనాకు చెందిన యుక్సిన్ సాంగ్‌పై విజయం సాధించింది. ఇక, దివ్య దేశ్‌ముఖ్, ద్రోణవల్లి హారిక మధ్య జరుగుతున్న క్వార్టర్స్ ట్రై బ్రేకర్‌కు వెళ్లింది.

# దేశవ్యాప్తంగా వాతావరణ సూచన

న్యూ ఢిల్లీ, జులై 21 (తీన్మార్ న్యూస్): కర్ణాటక తీరప్రాంతం, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, ఉత్తరాఖండ్‌లలో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ఢిల్లీ, హర్యానా, పంజాబ్, చండీగఢ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, కేరళ, మాహే, కొంకణ్, గోవా, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాల్లో కూడా రాబోయే 2-3 రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా.

అండమాన్ మరియు నికోబార్ దీవులు, ఉప-హిమాలయన్ పశ్చిమ బెంగాల్ మరియు సిక్కింలలో ఈరోజు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. అండమాన్ మరియు నికోబార్ దీవులలో ఈ నెల 26 వరకు ఉరుములతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉంది.తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. 12 జిల్లాలకు అతి భారీ వర్షాల హెచ్చరికను ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మరో 17 జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరికను జారీ చేశారు. ఆదిలాబాద్, కుమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని బులెటిన్ పేర్కొంది. హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలకు, రాబోయే 24 గంటల్లో సాధారణంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని అంచనా. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములు, ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

మొదటి పేజీ తరువాయి



కలెక్టర్లు, అధికారులు కూడా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని కీలక ప్రకటన చేశారు. ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు రేషన్ కార్డులు పంపిణీ చేయాలని చెప్పారు. మంత్రులు బాధ్యత తీసుకొని స్థానిక ఎమ్మెల్యేలను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అన్నారు. ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తుండటంతో రేషన్ కార్డుల డిమాండ్ బాగా పెరిగిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కొత్తగా 7 లక్షల కార్డులు ఇచ్చామని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎరువులు దొరకడం లేదని ప్రచారం చేస్తున్నారు. షాపులో ఎంత స్టాక్ ఉందో బయట నోటీస్ బోర్డులో పెట్టాలి. ఎరువుల షాపులపై పోలీసులు, అధికారుల నిఘా ఉండాలి. రాయితీపై ఇచ్చే ఎరువులను ఇతర వ్యాపారాలకు వాడుతున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎరువుల దారి మళ్లింపును అడ్డుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాల పరిధిలోని ఐఏఎస్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. కలెక్టర్ల కార్యచరణ రిపోర్టు నాకు రోజూ పంపించాలి. రోజూ కలెక్టర్లు ఏ పనిచేశారో నాకు తెలియాలి. ఆదివాసీ ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు కలెక్టర్లు పర్యవేక్షించాలి. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు ఖర్చు పెట్టడానికి ఒక్కొక్కరికి రూ.కోటి కేటాస్తున్నాం. వీటితో పాటు వాటర్ మేనేజ్‌మెంట్‌పై కూడా కలెక్టర్లు ఫోకస్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ఏటీసీల అభివృద్ధిని వేగవంతం చేయండి




హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) ల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్-2047 కు అనుగుణంగా ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి వివేక్ వెంకట స్వామి, సంబంధిత అధికారులు తదితరులు హాజరైన ఈ సమీక్షలో ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతి వివరాలను సీఎం ఆరా తీశారు. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు.

**ఆకస్మిక తనిఖీలు చేస్తా:**

ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తిగా చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఏటీసీల పురోగతిపై సీఎంకు వివరించిన అధికారులు రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఫేజ్-1 లో 25, ఫేజ్-2 లో 40, ఫేజ్-3 లో 46 ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నామని ఇప్పటి వరకు ఫేజ్-1, ఫేజ్-2 లో 49 అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

# నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో మరో బస్టాండ్



హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో మరో బస్టాండ్ అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ ఆరాంఘర్‌లో అత్యాధునిక బస్టాండ్‌ను నిర్మించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మంత్రి పొన్నం తెలిపారు. నాటి అవసరాల కోసం ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్‌లను నిర్మించారని వివరించారు. ఇప్పుడు ఎయిర్‌పోర్టు, మహబూబ్‌నగర్ ప్రాంత ప్రజలకు దగ్గరగా ఉండే విధంగా ఆరంఘర్ వద్ద ఒక స్థలం ఉందని దాంట్లో నిర్మించాలని భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్మించేందుకు ఆలోచన ఉందని, దీనిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ఫోర్త్ సిటీకి అనుసంధానం చేసేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీ కోసం ఆర్టీసీ డిపోలు, బస్టాప్‌ల కోసం స్థలం ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. నగరం విస్తరిస్తున్న కారణంగా బస్టాప్‌లకు స్థలాలు దొరకడం ఇబ్బందులు ఎదురవుతాయని, మరోవైపు బస్సుల సంఖ్య పెరిగిందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల డిమాండ్ మరింత పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికులకు అన్ని అత్యాధునిక సౌకర్యాలతో పలు విధానాలు తీసుకొస్తున్నట్లు వివరించారు. ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా రాబోయే కాలంలో మోడ్రన్ లుక్, మోడ్రన్ ఫెసిలిటీస్‌తో బస్టాండ్లు నిర్మిస్తామన్నారు.

# హెచ్సీఏ అక్రమాలలో బీఆర్ఎస్ ప్రమేయం

మొదటి పేజీ తరువాయి

అక్రమాల్లో బీఆర్ఎస్ నేత కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. పదేళ్లుగా రాష్ట్రంలోని క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారని మండిపడ్డారు. సంపత్ కుమార్‌ను కూడా విచారణ పరిధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. వచ్చిన డబ్బులన్నీ ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. తక్షణమే సొసైటీని రద్దు చేయాలని అన్నారు. హెచ్‌సీఏలో బీసీసీఐ రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని తెలిపారు. కాగా, గతంలోనూ గురువారెడ్డి హాట్ కామెంట్స్ చేసిన విషయం తెలిసిందే. హెచ్‌సీఏలో గతంలో ఉన్నట్టు ప్రస్తుతం లేదని అలా ఉంటే ప్రతీ సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక క్రికెటర్ బయటకి వస్తాడని గురువారెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సిటీ వరకే పరిమితం అయిందన్నారు. హెచ్‌సీఏలో ఎవరు ప్రెసిడెంట్ ఉన్నా అవినీతి జరుగుతోందని విమర్శించారు. ఐపీఎల్ నిర్వహణ కోసం బీసీసీఐ ప్రతీ సంవత్సరం హెచ్‌సీఏకు రూ.100 కోట్ల వరకు ఇస్తుందని ఆయన వెల్లడించారు. దాదాపు ఇప్పటి వరకు రూ.170 కోట్లు గోల్ మాల్ జరిగిందని ఆరోపించారు. విజిలెన్స్ వారు విచారణ చేయడం తర్వాత సీఐడీ ఎంటర్ అవ్వడంతో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఫేక్ క్లబ్ క్రియేట్ చేయడం, డాక్యుమెంట్లు సృష్టించడం అంతా బయటపడిందని గురువారెడ్డి అన్నారు.

# గూగుల్, మెటాకు ఈడీ మరోసారి సమన్లు

హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో గూగుల్, మెటా (ఫేస్‌బుక్) కంపెనీల అధికారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరోసారి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఈడీ జులై 21న గూగుల్, మెటా ప్రతినిధులను ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఇప్పటికే సమన్లు జారీ చేసింది. కానీ ఈ రెండు కంపెనీల ప్రతినిధులు హాజరు కాలేదు. దీంతో, ఈడీ వారికి మరోసారి నోటీసులు జారీ చేసింది. జులై 28న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. గూగుల్, మెటా వంటి టెక్ దిగ్గజ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లకు ప్రకటనల స్పేస్ అందించి, వాటి ప్రచారానికి సహకరించాయని ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసులో బెట్టింగ్ యాప్స్ కు ప్రచారం చేసిన 29 మంది ప్రముఖ వ్యక్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది ఈడీ. వీరిలో ప్రముఖ నటులు ప్రకాశ్ రాజ్, రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, నిధి అగర్వాల్, ప్రణీత సుభాష్, మంచు లక్ష్మీ వంటి సెలబ్రిటీలు ఉన్నారు.

# కేరళ మాజీ సీఎం మృతి పట్ల కేటీఆర్, హరీష్ రావు సంతాపం

హైదరాబాద్, జులై 21 (తీన్మార్ న్యూస్): సీపీఎం జాతీయ నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీష్ రావు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసారు. నిజాయితీగా, ప్రజాహితం కోసం పనిచేసి, ఆదర్శ నేతగా నిలిచిన అచ్యుతానందన్ రాజకీయ జీవితాన్ని ఎంతో స్ఫూర్తివంతంగా గడిపారన్నారు. మూడుసార్లు ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా ప్రజలకు అందించిన ఆయన సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సీపీఎం వ్యవస్థాపక సభ్యుడిగా ప్రజల పక్షాన పోరాడిన ఆయన జీవితం, అనేక తరాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఉజ్వల రాజకీయ జీవితాన్ని గడిపిన ఆయన మూడుసార్లు ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా వీఎస్ అచ్యుతానందన్ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారన్నారు. సీపీఎం వ్యవస్థాపక సభ్యుడిగా, ప్రజాహితానికి పాటుపడిన ఆయన సేవలు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. అచ్యుతానందన్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు హరీష్ రావు ట్వీట్ చేసారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసీలకు శుభవార్త

తెలంగాణ బ్యూరో, జులై 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసీలకు శుభవార్త తెలిపింది. 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రకటించిన జీవో 49 ను ప్రభుత్వం నిలుపుదల చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అధికారులు ఆదేశాలు జారీ చేసారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి సీతక్క, తుడుం దెబ్బ ఆదివాసీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. కాగా జీవో 49 ద్వారా కొమురంభీం ఆసిఫాబాద్ లో 3 లక్షల అటవీ భూమిని కన్జర్వేషన్ ఫారెస్ట్ కారిడార్ గా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా గత కొన్ని నెలలుగా ఆదివాసీలు, నేతలు దీనిని నిలిపివేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి జీవో 49 నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

# డయాలసిస్ పేషంట్లకు సర్కార్ తీపికబురు

మొదటి పేజీ తరువాయి

చేసింది. ఈ మేరకు సోమవారం మంత్రి సీతక్క సంబంధింత ఫైల్ పై సంతకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 4011 మంది డయాలసిస్ పేషంట్లకు సామాజిక పించన్ ఉండగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 4029 మంది డయాలసిస్ తో ఇబ్బంది పడుతున్న వారికి చేయూత పించన్లు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా మరో 681 మందికి పించన్లు మంజూరు చేసింది. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వీరు ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వం గుర్తించింది. వెరిఫికేషన్ పూర్తి చేసి పించన్లు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త లబ్ధిదారులు వచ్చే ఆగస్టు నుంచి ఒక్కొక్కరు నెలకు రూ.2016 చొప్పున పించన్ అందుకోనున్నారు.

# ఎస్ఎల్‌బీసీలో పనులు పూర్తికి ప్రభుత్వం కసరత్తు

నాగర్‌కర్నూల్, జులై 21 (తీన్మార్ న్యూస్): నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలను కుదిపేసిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి 150 రోజులు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 22న జరిగిన ఈ ప్రమాదంలో 14వ కిలోమీటర్ వద్ద టన్నెల్ కుప్పకూలడంతో 8 మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారు. ఇప్పటి వరకు కేవలం ఇద్దరి మృతదేహాలనే వెలికితీశారు, మిగతా ఆరుగురు కార్మికుల మృతదేహాలు టన్నెల్‌లోనే ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని నో గో జోన్‌గా ప్రకటించి కంచె ఏర్పాటు చేశారు. 63 రోజుల పాటు జరిగిన రెస్క్యూ ఆపరేషన్ విఫలమవడంతో ఇక మిగతా శవాలను వెలికితీయడం కష్టమని అధికారులు స్పష్టం చేశారు. ఎస్ఎల్‌బీసీ పనులు నిలిచిపోకుండా పూర్తి చేయడానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. డెన్మార్క్ నుంచి ఎలక్ట్రో మాగ్నటిక్ సర్వే పరికరాలు తెప్పించారు. వైమానిక దళ హెలికాప్టర్లు, లైడార్ సర్వేల సహాయంతో భూభాగ పరిశీలనలు చేస్తున్నారు. సొరంగ తవ్వకాల కోసం భూమి పొరలు, షీర్ జోన్‌లపై సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. మన్నెవారిపల్లి, నల్లవాగు, మల్లెలతీర్థం ప్రాంతాలతో పాటు టన్నెల్ కూలిన ప్రదేశాల్లో నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ) బృందాలు భూ పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. ఈ అధ్యయనాల ఆధారంగా భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# భారత ఉపరాష్ట్రపతి రాజీనామా



తెలంగాణ బ్యూరో, జులై 21 (తీన్మార్ న్యూస్): భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఆరోగ్య సమస్యల కారణంగా, వైద్యుల సలహా మేరకు తక్షణం రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67 (ఎ) ప్రకారం ఆయన రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో సహకరించారని, ఇది తనకు చాలా ఆహ్లాదకరమైన అనుభవమని పేర్కొన్నారు. అలాగే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు మంత్రివర్గానికి నేను ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి సహకారం నాకు ఎంతో విలువైందని.. ఆయన నుంచి నేనెన్నో విషయాలు నేర్చుకున్నానన్నారు. గతంలో ధన్‌ఖర్ మాట్లాడుతూ 'భగవంతుడు ఆశీర్వదిస్తే 2027 ఆగస్టులో పదవీవిరమణ చేస్తాను' అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. గౌరవనీయులైన ఎంపీల నుంచి లభించిన ఆప్యాతతో పాటు అనుబంధం అమూల్యమైందని.. తనకు జ్ఞాపకంగా నిలిచి ఉంటుందన్నారు. ఈ కాలంలో భారతదేశం అపూర్వమైన ఆర్థిక పురోగతి, అసాధారణ అభివృద్ధిని చూడడం, అందులో భాగం కావడం తనకు గర్వకారణంగా నిలువడంతో పాటు సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సమయంలో దేశానికి సేవ చేయడం తనకు నిజమైన గౌరవమని, పదవికి రాజీనామా చేస్తున్న సమయంలో భారత్ అద్భుతమైన విజయాలపై తాను గర్వంగా ఉన్నానని, దేశ ఉజ్వల భవిష్యత్‌పై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. వాస్తవానికి ఆయన ఐదేళ్ల పదవీకాలం 10 ఆగస్టు 2027న ముగియాల్సి ఉంది. జగదీప్ ధన్‌ఖర్ వృత్తిరీత్యా ఆయన న్యాయవాది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడానికి ముందు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా సేవలందించారు.

# జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

## పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్




వరంగల్ జిల్లా, జులై 21 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో ఉప ముఖ్యమంత్రి మల్లిభట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, దనసరి అనసూయ సితక్క, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. వర్షాలు, వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత, రేషన్ కార్డుల పంపిణీ పురోగతి అంశాలపై సమీక్ష జరిగింది. వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనవు కలెక్టర్ సంధ్యారాణి సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొంన్నారు.

# రేషన్ కార్డు పంపిణీ పై సమావేశం

## ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జూలై 21 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జిల్లాలోని రెండు నియోజక వర్గాలలో రేషన్ కార్డు పంపిణీ పై సమావేశం నిర్వహించి ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పౌర సరఫరాలు, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 10వ తేది వరకు రేషన్ కార్డులు పంపిణీకి అన్ని మండలాల వారిగా షెడ్యూల్ తయారు చేయాలని ఆదేశించారు. మంగళవారం నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తన దుకాణాలాల్లో తప్పని సరిగా స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనవు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి బాబు, ఇరిగేషన్ ఈఈలు తిరుపతిరావు, ప్రసాదు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో నూతన పోలీస్ స్టేషన్ ఏర్పాటు

## మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం






కొత్తపల్లి గోరి, 21 జులై (తీన్మార్ న్యూస్ ): గోరికొత్తపల్లి మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ ను మంత్రులు ఐటీ మినిస్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భూపాలపల్లి పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలో బాగంగా ఈ రోజు గోరుకొత్తపల్లిని మండలంగా ఏర్పాటు చేసి అన్ని రకాల వసతులు కల్పించడం హర్షదాయకంగా ఉందని మంత్రులు చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా వారు గోరికొత్తపల్లి మండల పోలీస్ స్టేషన్ కి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శాఖపురం దివ్యగారికి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి, ఉమ్మడి రేగొండ మండలం అధ్యక్షులు ఇప్పకాయల నర్సయ్య, కొత్తపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు జవ్వాజి వీరాస్వామి, యూత్ అధ్యక్షులు సముద్రాల రాజేష్, చెల్పూరి రాజు, చెక్క రవి, పుట్ట రవి, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఆగస్టు 10 వరకు మండలాల్లో లో రేషన్ కార్డుల పంపిణీ

**సీఎం రేవంత్ రెడ్డి**

**భారీ వర్షాల వల్ల ప్రమాదం జరగకుండా చూడాలి**

**పిడుగుపాటు వల్ల మానవ, పశువు ప్రాణ నష్టం కల్గకుండా చర్యలు**

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు**

**ఎరువుల డీలర్ల దగ్గర ఉన్న స్టాక్ వివరాలు నోటీస్ బోర్డుపై నమోదు చేయాలి**

**నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ**

**వానాకాలం పంట సాగుకు ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు**



జనగామ జిల్లా, జూలై 21 (తీన్మార్ న్యూస్): జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి , వాకాటి శ్రీహరి, సీతక్క, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్,రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ కలెక్టర్ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్ దృష్టి సారించాలని అన్నారు. జూలై 21 వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులు గా వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో హైదరా ఆధ్వర్యంలో 150 బృందాలను సిద్దం చేశామని అన్నారు. నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగు పాటుకు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాలు వచ్చినప్పుడు చెట్ల కింద స్తంభాల దగ్గర ఉండకుండా చూడాలని అన్నారు. పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీనికోసం పోలీసు అధికారులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటూ రోగాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలని, ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే అక్కడ ఆయిల్ బాల్స్ వంటివి స్థానిక సంస్థల ద్వారా వేయాలని అన్నారు. డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర సమయంలో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మన ప్రాజెక్టులలో నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం మన రాష్ట్రంలో దేశంలోనే అత్యధికంగా రెండు కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వారి ఉత్పత్తి చేశామని అన్నారు. గోదావరి బేసిన్ లో ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉందని, ఇక్కడ నీరు వృధాగా పోకుండా ప్రాజెక్టులలో ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యులర్ గా ప్రకటనలు విడుదల చేయాలని, ప్రతి ఎరువుల షాప్ వద్ద స్టాక్ వివరాలు నోటీసు బోర్డులు పెట్టాలని, 2 పోలీస్ అధికారులను నియంత్రణకు పెట్టాలని అన్నారు. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పి కొట్టాలని సీఎం పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులు ముందస్తుగా ఎరువుల స్టాక్ పెట్టుకోకుండా అవగాహన కలిగించాలని అన్నారు. 20 నుంచి 25 శాతం ఎరువులు వ్యవసాయ అవసరాల కోసం కాకుండా ఇతర అంశాలకు, డీజిల్ వాహనాలలో పొగ తగ్గించేందుకు సబ్సిడీ ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారని సీఎం అన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సబ్సిడీ ఎరువులు దారి మళ్ళించకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అంశాలకు యూరియా వినియోగిస్తే కఠినంగా వ్యవహరించాలని క్రిమినల్ కేసుల నమోదు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎరువుల అంశంలో ఫిర్యాదులను నమోదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ జిల్లాలలో ప్రచారం చేయాలని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా దాదాపు 7 లక్షల రేషన్ కార్డులను ,31 లక్షల లబ్ధిదారులతో మంజూరు చేసామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 96 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉపయోగిస్తున్నారని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఉన్నప్పుడు ప్రజలు ఎక్కువ పట్టించుకోలేదని బ్లాక్ మార్కెట్లో పోయేదని, ప్రస్తుతం సన్న బియ్యం సరఫరా చేయడంతో చాలా డిమాండ్ వచ్చిందని, ప్రజలు తప్పనిసరిగా రేషన్ తీసుకుంటున్నారని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, వీటిలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొనేలా చూడాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక చోట ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఒక చోట పాల్గొనేలా కలెక్టర్ కోఆర్డినేట్ చేసుకోవాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డిఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ కిందిస్థాయి సిబ్బంది అధికారులు ప్రజలను కలెక్టర్ అప్రమత్తం చేయాలని అన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో రివ్యూ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలను తూ చ తప్పకుండ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు పాటించాలన్నారు. జిల్లాలో ఉన్న ఫర్టిలైజర్ షాప్ లకు రెవిన్యూ, పోలీస్ అధికారులను నియమించే విధంగా వివరాలు ఇవ్వాలిసిందిగా వ్యవసాయ అధికారికి తెలిపారు. రేషన్ కార్డు లు ఇంకా ఎన్ని పంపిణి చేయాలిసి ఉన్న వివరాలను ఇవ్వాలని సివిల్ సప్లై అధికారులకు తెలిపారు. ఇరిగేషన్ కి సంబందించి చెరువుల నీటి నిల్వల వివరాలను రోజువారీగా సమర్పించాలన్నారు. వర్షాలకు సంబందించి ఆర్డీ వో, తహసీల్దార్ లు అప్రమత్తం గా ఉండి రోడ్ డ్యామేజ్ జరగకుండా కాలువలు తెగకుండా వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. ఈ వీసీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,ఆర్డీఓ లు, అగ్రికల్చర్, సివిల్ సప్లై, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 21 (తీన్మార్ న్యూస్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఖమ్మం జిల్లా కేంద్రం నుండి రాష్ట్ర ఉ ప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేకానంద, దామోదర రాజనర్సింహ, దుద్దిల్ల శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. వర్షాకాలం అయినందున జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో నీటి నిల్వలు స్థాయి- వినియోగం, వానాకాలం సీజన్ లో వ్యవసాయ సాగు, యూరియా నిల్వలు, ఎరువులు కొరత లేకుండా సమకూర్చడం, ప్రతి ఫర్టిలైజర్ షాపును తనిఖీలు చేపట్టి ఆయా షాపులలో ఉన్న నిల్వలు, నోటీస్ బోర్డులపై ఉంచిన వివరాల పరిశీలన చేసి పక్కదారి పట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జన జీవనానికి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్, రహదారులు తెగిపోకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ నెల నుండి ఇప్పటివరకు వర్షపాతం తక్కువగా నమోదైనప్పటికీ గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని, వాతావరణ సూచనలకు అనుగుణంగా జిల్లాలలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జిల్లాలలో పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. గిరిజనులు అంటూ వ్యాధుల బారిన పడకుండా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థల ప్రాంతాల అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలని, పశువులకు ఎలాంటి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో నివేదికను అందించాలని తెలిపారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటికి సంబంధించి నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచామని తెలిపారు. యూరియా స్టాక్ కు సంబంధించి ప్రతి ఎరువుల షాపు వద్ద స్టాక్ వివరాలు తెలిసేలా బోర్డుపై ప్రదర్శించాలని, ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ఎరువుల కొరత ఉన్నట్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, ఈ విషయంపై తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలిపారు. యూరియా కావలసినంత అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఇతర వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు సంక్షేమమే అన్నిటికన్నా ముఖ్యమని తెలిపారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదుల కొరకు ప్రతి జిల్లాలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 96 లక్షల 95 వేల 299 రేషన్ కార్డులు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా దాదాపు 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. గతంలో చౌక ధరల దుకాణాలపై ప్రజలకు ఆసక్తి ఉండేది కాదని, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ కార్డు, చౌక ధరల దుకాణం విలువ పెరిగిందని, 3 నెలల సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ నెల 25 నుండి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, శాసన సభ్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రులు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని, జిల్లా కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను పరిశీలించి అవసరమైన మేరకు నియామకంతో పాటు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాలలో అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, డెంగ్యూ, మలేరియా ఇతర జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాతావరణ శాఖ సూచన మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజా సంక్షేమం కోసం 3 గంటల ముందుగా బృందాలను పంపించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సంక్షేమ చర్యలకు అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ముప్పు ఉండే ప్రాంతాల్లో ముందస్తుగా అవసరమైనంత మేరకు ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా తక్షణమే స్పందించేలా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వర్షాలు పెరగడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున, ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృతంగా మెలకాల కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. నీటి నిల్వలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు తవ్వి దోమల వ్యాప్తి నివారించాలని సూచించారు. యూరియా వంటి కీలక ఎరువుల సరఫరా విషయంలో రైతులలో ఆందోళన కలగకుండా ఉండేందుకు ప్రతి ఎరువుల దుకాణం ముందు అందుబాటులో ఉన్న స్టాక్ వివరాలను ప్రదర్శించేలా స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైతే డిమాండ్కు అనుగుణంగా మరింత స్టాక్ కూడా సమకూర్చేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచిచారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, ఇరిగేషన్ ఈఈ అర్జున్ రావు మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు



# విపక్షంగా కాంగ్రెస్ విఫలం!

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. యధావిధిగానే వాయిదాలతో సమావేశాలు స్వాగతం పలికాయి. ప్రతి సమావేశంలోనూ ఇలాగే జరుగుతోంది. పార్లమెంట్ ప్రజల కోసం ఉద్దేశించిందిన్న ఇంగితం అధికార, విపక్షాలకు ఉండడం లేదు. మొక్కుబడిగా సమావేశాలకు హాజరు కావడం, బత్తా పుచ్చుకోవడం, ప్రజల నెత్తిన పన్నులు రుద్దడం అన్న తంతు కొన్నేళ్లుగా సాగుతోంది.

నిజంగానే మనం ప్రజలకు న్యాయం చేస్తున్నామా అన్న ఆలోచన ఏ నాయకుడూ చేయడంలేదు. తొలిరోజే వాయిదా తీర్మానాలు ఇవ్వడం, గొడవ చేయడం వంటి చర్యలు ఈ సమావేశాల్లోనూ కనిపించాయి. దీంతో వాయిదాతో స్పీకర్ ఓం బిర్లా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. గొడవ చేస్తేనే ప్రతిపక్షం అన్న రూఢి నాటుకుపోయింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఎప్పుడూ విఫలం అవుతూనే ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించేందుకు కొన్ని పద్ధతులు, రూల్స్ ఉన్నాయి. ఏ సమస్యనైనా చర్చించి, జవాబు రాబట్టడం ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. కానీ కాంగ్రెస్ అలా చేయడం లేదు. ఇండియా కూటమిగా జట్టు కట్టినా పార్లమెంట్ అంటే అధికార బిజెపికి భయం లేకుండా పోతోంది. ఎందు కంటే బలహీనమైన ప్రతిపక్షం, పేలవమైన తీరు కారణంఅని చెప్పవచ్చు. పార్లమెంట్ సమావేశాలు ఆగస్ట్ 21 వరకు అంటే దాదాపు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి. ఆగస్టు12 నుంచి 18 వరకు సమావేశాలకు సెలవులు ఉంటాయి. ఈ సమావేశాల్లో మొత్తం 7 పెండింగ్ బిల్లులతో పాటు మరో 8 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఇక, దేశ భద్రతకు సంబంధించిన పలు కీలక విషయాలను పార్లమెంటులో చర్చించాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ వంటి వాటిపై చర్చించాలని ఇండియా కూటమి పట్టుపట్టాలని కోరుకుంటోంది. తానే యుద్ధం ఆపించానని ట్రంప్ పదేపదే చెప్పడం, దేశ ఆంతరంగిక విషయాలలో ప్రమేయం అయిందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ట్రంప్ వ్యాఖ్యలపై మోడీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, ఇంతకు అమెరికా పట్ల ఎటువంటి వైఖరి ఉందనేది తెలియచేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయనున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు వాడీ వేడీగా జరగ నున్నాయి. అయితే, ఆపరేషన్ సింధూర్‌పై చర్చించేందుకు సిద్ధమేనని ఇప్పటికే కేంద్రం స్పష్టం చేసింది. నిజానికి ఈ సమస్యలను ఏదో ఒకరూపంలో చర్చించి, సమాధానాలు రాబట్టవచ్చు. ప్రశ్నోత్తరాల సమయంలో వాటిని కొనసాగించడం ద్వారాను సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చు. కానీ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అలా చేయడం లేదు. కేవలం రచ్చచేయడం ద్వారా వార్తల్లోకి ఎక్కాలని చూస్తోంది. ప్రజలు ఆశిస్తున్నది ఏమిటో గుర్తించి అందుకు అనుగుణంగా ఎజెండాను రూపొందించుకోవడంలో కాంగ్రెస్ ప్రతిసారీ విఫలం అవుతోంది. పార్లెంట్ లోపలా,బయటా విధానాల రూపకల్పనలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోంది. 75 ఏళ్లకు చేరువలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పోటీపడటంలో 50 ఏళ్లు పైబడిన రాహుల్‌గాంధీ వెనుకబడుతున్నారు. దీనికి కారణం స్పష్టమైన విధానాలు. నాయకత్వ లోపాలే కారణంగా చెప్పాలి. పార్లమెంట్ సమావేశాలు అనగానే ప్రజలు ఏమి కోరుకుంటున్నారన్న ఆలోచనలు చేయాలి. పార్లమెంటులో ఎలా చర్చిస్తే ప్రభుత్వాన్ని నిలదీయవచ్చున్న వ్యూహం ఉండాలి. ఇలాంటి వ్యూహాలు లేకపోవడం వల్లనే కాంగ్రెస్ కాలక్రమంలో మెజారిటీ ప్రజలకు దూరమవుతోంది. అలాగే యు-ువతరానికి పూర్తిగా దూరమయ్యారు. సమస్యలు ఎదురైనప్పుడు సత్తా చాటాలి. అందుకు పార్లమెంట్ మంచి వేదిక. ముందుతరం కాంగ్రెస్ నాయకత్వం అనుసరించిన విధానాలు ఏమిటి? ఇప్పుడు ఆ పార్టీ యువ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? అని ప్రశ్నించుకుంటే జవాబు లభించగలదు. ప్రధానంగా ఓ 20 రోజుల పాటు జరిగే పార్లమెంటులో ఏయే అంశాలు చర్చించాలి, ఎలా చర్చించాలి అనే ప్రణాళిక ఉండాలి. కానీ అలా జరగడంలేదు. రాహుల్‌కు నాయకత్వ లక్షణాలు ఎలాగూ లేవు. కనీసం ఇతర సీనియర్ నేతలతో చర్చించి, పార్లమెంట్ వ్యూహం అనుసరించాలి. అదీ చేయడం లేదు. ఈ కారణంగా మెజారిటీ ప్రజలు క్రమంగా ఆ పార్టీకి దూరమవుతూ వచ్చారు. నెహ్రూ,ఇందిరాగాంధీ అనుసరించిన విధానాలను కూడా రాహుల్‌గాంధీ అధ్యయనం చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను, పోకడలను ఆకళింపు చేసుకొని అందుకు అనుగుణంగా పార్టీకి దిశానిర్దేశం చేయడంలో రాహుల్‌గాంధీ విఫలం అవుతున్నారు. మ-రోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల మనోభావాలకు అనుగుణం గా వ్యూహ రచన చేస్తూ పార్లమెంటులో తన వాగ్ధాటిని వినిపిస్తున్నారు. సమస్య ఏదైనా సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. అలాంటప్పుడు సమస్యను ఎలా, ఎప్పుడు చర్చించాలన్న వివేచన చేసుకోవాలి. అదేపనిగా వాయిదా తీర్మానాలు ఇవ్వడం, వాటిని స్పీకర్ తిరస్కరించడం షరామామూలుగా జరిగే ప్రక్రియ. అలాకాకుండా సమస్యలను గుర్తించి, వాటిపై అధ్యయనం చేసి, నోటీసులు ఇచ్చి చర్చకు పట్టుబట్టాలి. అలా చేయడంలో కాంగ్రెస్, దానిని అనుసరిస్తున్న ఇతర పార్టీలుకూడా విఫలం అవుతున్నాయి. తక్షణ చర్చ అన్నది దేశంలో కొంపలు అంటుకుంటే తప్ప జరగదు. ఈ మాత్రం కూడా తెలియని వారు మన నేతులగా ఉండడం దేశం చేసుకున్న దౌర్భాగ్యం. పార్లమెంట్ సమయాన్ని వృథా చేయకుండా సమస్యలను చర్చించేలా చేస్తు తప్ప ప్రజలు నమ్మరు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలు ఏమిటి? ఎన్నికల్లో ఆయన విజయాలు అందుకోవడానికి కారణం ఏమిటి? అని అధ్యయనం చేయకుండా కాలం చెల్లిన నినాదాలను అందిపుచ్చుకోవడం అవివేకం అవుతుంది. అందుకే భారతీయ జనతా పార్టీ మెజారిటీ ప్రజలకు చేరువ అవుతుండగా, కాంగ్రెస్ పార్టీ దూరమవుతోంది. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా, యువతరం మనోభావాలతో పొంతన లేకుండా రాహుల్‌గాంధీ ఆలోచనలు ఉండటం కాంగ్రెస్ పార్టీకి శాపంగా పరిణమిస్తోంది. అలాగే పార్లమెంట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోతోంది. ప్రజల సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోతోంది. దీనికి ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌దే బాధ్యత అని చెప్పక తప్పదు.

# జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్ కార్డుల పంపిణీ

**సీఎం రేవంత్ రెడ్డి**

**వర్షాల వల్ల ఏ ప్రమాదం జరగకుండా చూడాలి**

**సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు**

**ఎరువుల డీలర్ల దగ్గర ఉన్న స్టాక్ వివరాలు బోర్డు పై నమోదు చేయాలి**


**నూతన రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ**




ములుగు జిల్లా, జూలై 21 (తీన్మార్ న్యూస్): జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి, వాకాటి శ్రీహరి, ధనసరి అనసూయ సీతక్క, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ కలెక్టర్ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్ దృష్టి సారించాలని అన్నారు. జూలై 21 వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులు గా వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో హైదరా ఆధ్వర్యంలో 150 బృందాలను సిద్దం చేశామని అన్నారు. నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిడుగు పాటుకు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాలు వచ్చినప్పుడు చెట్ల కింద స్తంభాల దగ్గర ఉండకుండా చూడాలని అన్నారు. పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీనికోసం పోలీసు అధికారులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటూ రోగాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలని, ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే అక్కడ ఆయిల్ బాల్స్ వంటివి స్థానిక సంస్థల ద్వారా వేయాలని అన్నారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర సమయంలో కలెక్టర్లు ఖర్చు చేసేందుకు నిధులు కూడా అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మన ప్రాజెక్టులలో నీరు నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత సంవత్సరం మన రాష్ట్రంలో దేశంలోనే అత్యధికంగా రెండు కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వారి ఉత్పత్తి చేశామని అన్నారు. గోదావరి బేసిన్ లో ప్రాజెక్టులలో నీరు తక్కువగా ఉందని, ఇక్కడ నీరు వృధాగా పోకుండా ప్రాజెక్టులలో ఎప్పటికప్పుడు నింపాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, యూరియా అందుబాటులో ఉండాలని అన్నారు. విత్తనాల, ఎరువులు అక్రమ స్టాక్ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలి విత్తనాల అమ్మే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల స్టాక్ ఎంత అందుబాటులో ఉందో కలెక్టర్ రెగ్యులర్ గా ప్రకటనలు విడుదల చేయాలని, ప్రతి ఎరువుల షాప్ వద్ద స్టాక్ వివరాలు నోటీసు బోర్డులు పెట్టాలని, 2 పోలీస్ అధికారులను నియంత్రణకు పెట్టాలని అన్నారులి. ఎరువుల లభ్యత పై అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పి కొట్టాలని సీఎం పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులు ముందస్తుగా ఎరువుల స్టాక్ పెట్టుకోకుండా అవగాహన కలిగించాలని అన్నారు. 20 నుంచి 25 శాతం ఎరువులు వ్యవసాయ అవసరాల కోసం కాకుండా ఇతర అంశాలకు, డీజిల్ వాహనాలలో పొగ తగ్గించేందుకు సబ్సిడీ ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారని సీఎం అన్నారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తంగా ఉంటూ సబ్సిడీ ఎరువులు దారి మళ్ళించకుండా చూడాలని అన్నారు. వ్యవసాయ అవసరాలకు కాకుండా ఇతర అంశాలకు యూరియా వినియోగిస్తే కఠినంగా వ్యవహరించాలని క్రిమినల్ కేసుల నమోదు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎరువుల అంశంలో ఫిర్యాదులను నమోదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ జిల్లాలలో ప్రచారం చేయాలని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా దాదాపు 7 లక్షల రేషన్ కార్డులను, 31 లక్షల లబ్ధిదారులతో మంజూరు చేసామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 96 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులు రేషన్ కార్డు ఉపయోగిస్తున్నారని అన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఉన్నపుడు ప్రజలు ఎక్కువ పట్టించుకోలేదని బ్లాక్ మార్కెట్లో పోయేదని, ప్రస్తుతం సన్న బియ్యం సరఫరా చేయడంతో చాలా డిమాండ్ వచ్చిందని, ప్రజలు తప్పనిసరిగా రేషన్ తీసుకుంటున్నారని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు మండల కేంద్రాలలో అధికారికంగా రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని, వీటిలో తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ పాల్గొనేలా చూడాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కనీసం ఒక చోట ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ఒక చోట పాల్గొనేలా కలెక్టర్ కోఆర్డినేట్ చేసుకోవాలని సీఎం తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఆర్డిఓ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించాలని అన్నారు. వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ కిందిస్థాయి సిబ్బంది అధికారులు ప్రజలను కలెక్టర్ అప్రమత్తం చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థకు చేరిన ఇండ్ల నుండి ప్రజలను ఖాళీ చేయవలసిందిగా సూచించాలని అన్నారు. వర్షాలతో డ్రైనేజీలు నిండిపోకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు వాతావరణ, వర్ష సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నిరంతరం క్యాంపులు నిర్వహిస్తూ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయాలని అన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా డెంగీ నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. వానాకాలం సాగులో భాగంగా యూరియా కొరత రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. యూరియా అమ్మకాల కేంద్రాల్లో స్టాక్ నిలువలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డీఓ వెంకటేష్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలి

**ట్రంప్ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలి ● రాజ్యసభలో విపక్షనేత ఖర్గే డిమాండ్**



**న్యూఢిల్లీ, జూలై 21:** వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఇటీవలి భారత్-పాకిస్తాన్ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం వాదనలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏప్రిల్ 22న జరిగిన పెహల్గామ్ దాడి గురించి మాట్లాడుతూ, ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి జరిగి నెలలు గడిచినా, ఆ ఉగ్రవాదులను ఇప్పటి వరకు పట్టుకోలేదు, వారి గురించి సమాచారం కూడా లేదన్నారు. మా పార్టీ మాత్రమే కాదు, అన్ని పార్టీలు దేశాన్ని బలోపేతం చేయడానికి, సైన్యానికి ధైర్యం నింపడానికి మద్దతు ఇస్తున్నట్లు- తెలిపారు. కానీ, ఇప్పుడు అసలు పెహల్గామ్ దాడి జరిగిన దాని గురించి స్పష్టమైన సమాచారం కావాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇం-టె-లిజెన్స్ విషయంలో లోపం జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ చెప్పారు. ఆ క్రమంలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రభుత్వం ప్రపంచానికి, భారత ప్రజలకు చెప్పింది. కానీ, ఆ తర్వాత ఏమైంది, ఏం జరిగిందో సమాచారం ఇవ్వాలని ఖర్గే కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్-పాకిస్తాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని 24 సార్లు పేర్కొన్నారని ఖర్గే గుర్తు చేశారు. ట్రంప్ ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నారు? శాంతి ఒప్పందం జరిగిందా? ఒకవేళ జరిగితే, దాని వివరాలు ఏంటి? ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. దేశ ప్రజలకు, పార్లమెంటుకు సమాచారం అందించడం ప్రభుత్వం బాధ్యత అని ఈ సందర్భంగా ఖర్గే గుర్తు చేశారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో జాప్యం జరగడం, ఇం-టె-లిజెన్స్ వైఫల్యం గురించి ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. మన సైన్యం ధైర్యంగా పోరాడుతోంది. కానీ, ఇటు-వంటి సంఘటనలు మన భద్రతా వ్యవస్థలోని లోపాలను బయటపెడుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం మాట్లాడేందుకు సిద్ధంగా ఉందని, అన్ని వివరాలనూ దేశ ప్రజలకు తెలియజేస్తామని బీజేపీ నేత, రాజ్యసభలో లీడర్ ఆఫ్ ది హౌస్ జేపీ నడ్డా స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం ఈ ప్రశ్నలకు ఎలా సమాధానం ఇస్తుంది, ఏంటనేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# లోక్‌సభలో గొంతు నొక్కారు

**మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు ● విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపణ**



**న్యూఢిల్లీ, జూలై 21:** లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న తనకు లోక్‌సభ సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో అధికార పక్షం సభ్యులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర రక్షణ మంత్రి, ప్రభుత్వం లోని ఇతర మంత్రులకు మాట్లాడడానికి అవకాశం ఇచ్చి.. తనకు మాత్రం అభిప్రాయాలను తెలియజేసే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా లోక్‌సభలో మాట్లాడే హక్కు తనకు ఉన్నప్పటికీ.. వారు ఈ విధంగా చేయడం ప్రతిపక్షాల హక్కులను కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్ సభలో విపక్షాలకు కూడా మాట్లాడ టానికి అవకాశం ఉండాలి అని డిమాండ్ చేశారు. సభలో నేను రెండు విషయాలు చెప్పాలనుకున్నాను.. రక్షణ మంత్రి, ఇతరులు మాట్లాడతారు.. కానీ, విపక్ష నేతగా నాకు అవకాశం ఇవ్వలేదని మండిపడ్డారు. మరోవైపు, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సిద్ధమా అని సవాల్ చేసారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ పై చర్చకు సిద్ధంగా ఉంటే, సభలో మాట్లాడటానికి మాకెందుకు అవకాశం ఇవ్వలేదు అని ప్రశ్నించింది. విపక్ష నేతగా రాహుల్‌కు అవకాశం ఇచ్చి ఉండాల్సింది అని పేర్కొన్నారు. చర్చ జరపడానికి సిద్ధంగా ఉంటే విపక్షాల గొంతు ఎందుకు నొక్కుతున్నారని ప్రియాంక గాంధీ అడిగారు.



# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం

**లోక్‌సభలో నినాదాలతో తొలిరోజు వాయిదా**

**రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యుల ప్రమాణం**


**న్యూఢిల్లీ, జూలై 21:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభ సమావేశమయ్యాయి. తొలుత పహల్గాం ఉగ్రదాడి, ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు ఉభయ సభలు నివాళులర్పించాయి. రాజ్యసభలో కొత్తగా ఎంపికైన నలుగురు ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. అటు- లోక్‌సభలో విపక్షాలు నిరసనకు దిగాయి. ఆపరేషన్ సిందూర్'తో పాటు పలు అంశాలపై చర్చకు పట్టుబడుతూ లోక్‌సభలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. తామిచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబట్టాయి. అయితే ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి, మీరు చర్చక్రమంలో వస్తే సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని స్పీకర్ ప్రకటించారు. పోడియంలోకి రావడం, నిలబడి నినాదాలు చేయడం తగదని అన్నారు. వారి నినాదాల నడుమ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రతిపక్ష ఎంపీలు నిరసన విరమించాలని సభాపతి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పార్లమెంటు సమావేశాలు జరగడం ఇదే తొలిసారి. ఆగస్టు 21 వరకు 21 రోజుల పాటు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలపై ప్రశ్నల్ని సంధించడానికి విపక్షాలు మూకుమ్మడిగా సిద్ధమయ్యాయి. తాము లేవనెత్తే అంశాలపై ప్రధాని స్పందిం చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, పార్లమెంటు- నియమాలు, సంప్రదాయాలకు అనుగుణంగా 'ఆపరేషన్ సిందూర్' సహా అన్ని అంశాలు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే స్పష్టం చేశారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి, జూలై 21:** నష్టాలను వీడి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. విశ్లేషకుల అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడం సూచీలకు కలిసొచ్చింది. దీంతో రెండ్రోజుల వరుస నష్టాల తర్వాత సూచీలు బయటపడ్డాయి. మరోవైపు రికార్డు త్రైమాసిక ఫలితాలను ప్రకటించినప్పటికీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3 శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ ఉదయం 81,918.53 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,757.73) స్వల్ప లాభాల్లో ప్రారంభమై వెంటనే నష్టాల్లోకి జారుకుంది. కాసేపటి తర్వాత మళ్లీ లాభాల్లోకి వచ్చిన సూచీ.. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,274.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 442.61 పాయింట్ల లాభంతో 82,200.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122.30 పాయింట్ల లాభంతో 25,090.70 వద్ద ముగిసింది.

# రాజకీయ "ప్రాతినిధ్య" వేదికపై కానరాని దివ్యాంగులు..?

దివ్యాంగుల "రాజకీయ" ప్రాతినిధ్యంపై సమగ్ర చర్చ
దివ్యాంగులు రాజకీయ ప్రతినిధులుగా ఎదగాలి
ప్రొఫెసర్ శ్రీనివాస్ రావుతో తీన్మార్ ప్రతినిధి ముఖా ముఖి







**పరిచయం:**

ఎం. రమేష్: నమస్కారం సార్! తీన్మార్ దినపత్రిక తరఫున మీకు స్వాగతం. తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యంపై సమగ్ర చర్చకు ఈరోజు మీ సమయాన్ని కోరాం. ఇది చాలా ముఖ్యమైన విషయం. దివ్యాంగులు రాజకీయ ప్రతినిధులుగా ఎదగడానికి ఉన్న అవకాశాలు, ఎదురవుతున్న సవాళ్లు, అలాగే ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న రిజర్వేషన్ల వివరాలపై అవగాహన కల్పించడం ఈ ముఖాముఖి ప్రధాన లక్ష్యం.

ప్రొ. శ్రీనివాస్ రావు: నమస్కారం రమేష్ గారు. తప్పకుండా, ఈ అంశంపై చర్చించడం చాలా అవసరం.

ఎం. రమేష్: సామాజిక స్థాయిలో దివ్యాంగులకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలు ఏమిటి?

ప్రొ. శ్రీనివాస్ రావు: దివ్యాంగులు సమాజంలో బాధ్యత గా కాకుండా, ఒక అవకాశంగా గుర్తించబడాలి. ప్రస్తుతం వారికి అవమానం, పక్షపాతత్వం, భౌగోళిక అడ్డంకులు (పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సౌకర్యాల లోపం), విద్యా వ్యవస్థలో లోపాలు ఇవన్నీ వారి స్వావలంబనను నిరోధిస్తున్నాయి. సమాజంలో వారి పట్ల ఉన్న పాత అభిప్రాయాలు మారాలి. వారికి తగిన మద్దతు, సదుపాయాలు కల్పించినప్పుడే వారు స్వతంత్రంగా జీవించగలరు, సమాజానికి వారి వంతు సేవ చేయగలరు.

ఎం. రమేష్: దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యానికి వ్యతిరేకతలు ఎందుకు ఎదురవుతున్నాయి?

ప్రొ. శ్రీనివాస్ రావు: దివ్యాంగుల ప్రతినిధుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. చట్టసభల్లో, పాలనాపరమైన నిర్ణయాల్లో వారి భాగస్వామ్యం లేకుంటే, వారి సాధారణ సమస్యలు ఎప్పటికీ పరిష్కారం కావు. పార్లమెంటు, అసెంబ్లీ, స్థానిక సంస్థలు ఇవన్నీ దివ్యాంగుల అవసరాలను అర్థం చేసుకొని, వారి సమస్యలను పరిష్కరించడానికి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వ్యవస్థలో వారికి సరైన ప్రాతినిధ్యం లేకపోవడం వల్లనే వారి సమస్యలు పట్టించుకోవడం లేదు.

ఎం. రమేష్: మరి దీనిపై పరిష్కారం ఎలా ఉండాలి? మీరు కొన్ని సూచనలు చేయగలరా?

ప్రొ. శ్రీనివాస్ రావు: తప్పకుండా. దీనికి సమగ్రమైన విధానం అవసరం.

ప్రత్యేక రిజర్వేషన్లు: రాజకీయాల్లో, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో, అవసరమైతే అసెంబ్లీ, పార్లమెంట్ స్థాయిలో కూడా ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి.

సమగ్ర డేటా: దివ్యాంగుల ఓటర్ల సంఖ్య, వారి రాజకీయ ప్రాతినిధ్యంపై సమగ్ర డేటా అందుబాటులో ఉండాలి. దీని ఆధారంగానే అభివృద్ధి నిధులు, కార్యక్రమాలు రూపొందించాలి.

అంతర్గత శిక్షణ: ప్రభుత్వ ఉద్యోగులకు, రాజకీయ నాయకులకు దివ్యాంగుల పట్ల అవగాహన పెంపొందించడానికి నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.

ప్రత్యక్ష విభాగాలు: స్థానిక, రాష్ట్ర స్థాయిలో దివ్యాంగుల సంక్షేమం, రాజకీయ భాగస్వామ్యం కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి, వాటికి బాధ్యతలు అప్పగించాలి.

ఎన్.జి.ఓ.లు, ప్రభుత్వ భాగస్వామ్యం: స్వచ్ఛంద సంస్థలు (NGOలు) మరియు ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యం ద్వారా దివ్యాంగుల హక్కుల అమలును వేగవంతం చేయాలి.

ఎం. రమేష్: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ మరియు రాజకీయ ప్రాతినిధ్యం కోసం పనిచేస్తున్న సంస్థలు, NGOల పాత్ర ఎంతవరకు ఉంది? ప్రభుత్వం వారితో కలిసి పనిచేయడానికి ఉన్న అవకాశాలు ఏమిటి?

ప్రొ. శ్రీనివాస్ రావు: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పనిచేస్తున్న సంస్థలు, NGOలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నేను అనుకోవడం లేదు. అలా అని అన్ని సంఘాలను విమర్శించను. ఎందుకంటే కొన్ని సంస్థలు, NGOలు వారి స్వార్థానికే దివ్యాంగుల పేరును వాడుకొని పబ్బం గడుపుతున్నాయి. దుప్పట్లు, పండ్లు, వీల్ చైర్లు పంచడం వల్ల వారికి అభివృద్ధి ఎలా పొందుతారు. ప్రధానమైన సమస్యలపై, అసలైన అభివృద్ధి అవకాశాలపై ఈ సంస్థలు, సంఘాలు ప్రశ్నించడం, పోరాడడం లేదు. ఇలా గనుక పని చేస్తే.. హక్కు పరిరక్షణ, రాజకీయ ప్రాతినిధ్యం సాధ్యపడుతుంది.

**దివ్యాంగుల ప్రస్తుత రాజకీయ ప్రాతినిధ్యం మరియు సవాళ్లు:**

ఎం. రమేష్: సార్, తెలంగాణ రాష్ట్రంలో దివ్యాంగుల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, స్థానిక సంస్థల నుండి రాష్ట్ర స్థాయి వరకు వారి రాజకీయ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణాలు ఏమని భావిస్తున్నారు?

ప్రొ. శ్రీనివాస్ రావు: అవును, ఇది నిజంగా ఆందోళన కలిగించే విషయం. దీనికి ప్రధాన కారణాలు ఆర్థిక, సామాజిక మరియు భౌతిక అడ్డంకులు. రాజకీయాల్లోకి రావడానికి అవసరమైన ఆర్థిక వనరులు దివ్యాంగులకు పెద్ద సమస్య. ప్రచారం, సమావేశాలకు హాజరుకావడానికి రవాణా ఖర్చులు వారికి భారంగా మారతాయి. సామాజికంగా, దివ్యాంగుల సామర్థ్యాలపై సమాజంలో లోతైన అపోహలు, వివక్ష ఉన్నాయి. చాలా మంది దివ్యాంగులను నాయకులుగా చూడటానికి, ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండరు. భౌతిక అడ్డంకులు కూడా ఒక ముఖ్యమైన సవాలు. ఎన్నికల కార్యాలయాలు, సమావేశ మందిరాలు, ప్రచార వేదికలు వారికి అందుబాటులో ఉండకపోవడం వారి భాగస్వామ్యాన్ని తగ్గిస్తుంది.

ఎం. రమేష్: మరి, ఈ సవాళ్లను అధిగమించడానికి ఎలాంటి మద్దతు అవసరం అని మీరు సూచిస్తారు?

ప్రొ. శ్రీనివాస్ రావు: ఈ సవాళ్లను అధిగమించడానికి బహుముఖ విధానం అవసరం. ఆర్థిక సహాయం, సామాజిక అవగాహన కార్యక్రమాలు, మరియు అన్ని భౌతిక ప్రదేశాలలో అందుబాటులో ఉండే మౌలిక సదుపాయాల కల్పన చాలా ముఖ్యం. ప్రభుత్వాలు ఆర్థికంగా అండగా నిలవాలి, సమాజంలో మార్పు తీసుకురావడానికి విస్తృత అవగాహన ప్రచారాలు నిర్వహించాలి. అలాగే రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కూడా వారి విభాగల్లో దివ్యాంగులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. తద్వారా వారి సమస్యలకు, సవాళ్లకు, అభివృద్ధికి ఓ మార్గాన్ని సృష్టించినబడినట్లు అవుతుంది.

**రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు మరియు లోపాలు:**

ఎం. రమేష్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. అయితే, వారి రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్దిష్ట నిర్ణయాలు ఏమైనా ఉన్నాయా?

ప్రొ. శ్రీనివాస్ రావు: ప్రభుత్వం సంక్షేమ పథకాలపై దృష్టి సారించింది కానీ, వారి రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి నిర్దిష్ట నిర్ణయాలు తీసుకున్నట్లు స్పష్టమైన సూచనలు లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు గానీ.. రాజకీయ పార్టీలకు గానీ దివ్యాంగులను ఓటు బ్యాంకుగా చూస్తూ.. (చట్ట సభల్లో) నిర్ణయాలు తీసుకోవడంలో భాగస్వామ్యం కల్పించకపోవడం వల్ల వారి అభివృద్ధికి.. వారి సమస్యల పరిష్కారానికి సరైన వేదిక లేకుండా ఉంది. ఇది ఒక ప్రధాన లోపంగా చెప్పవచ్చు.

ఎం. రమేష్: దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాల్లో మీరు గమనించిన ప్రధాన లోపాలు ఏమిటి? వీటిని సరిదిద్దడానికి ఎలాంటి మార్పులు అవసరం?

ప్రొ. శ్రీనివాస్ రావు: ప్రధాన లోపం ఏమిటంటే, దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యం పట్ల స్పష్టమైన విధానాలు లేవు. వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించకపోవడం, రాజకీయాల్లోకి వచ్చే వారికి మద్దతు ఇవ్వకపోవడం వంటివి లోపాలు. వీటిని సరిదిద్దడానికి చట్టపరమైన సంస్కరణలు, నిర్దిష్ట రిజర్వేషన్లు, మరియు అవగాహన కార్యక్రమాలు అవసరం.

**అవసరమైన సంస్కరణలు మరియు నిర్ణయాలు:**

ఎం. రమేష్: దివ్యాంగులు రాజకీయాల్లో మరింత చురుకుగా పాల్గొనడానికి, నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవడానికి ఎలాంటి సంస్కరణలు అవసరం? ఉదాహరణకు రాజకీయ పార్టీలలో అంతర్గత రిజర్వేషన్లు, శిక్షణ కార్యక్రమాలు.

ప్రొ. శ్రీనివాస్ రావు: రాజకీయ పార్టీలలో అంతర్గత రిజర్వేషన్లు కల్పించడం చాలా అవసరం. నాయకత్వ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, రాజకీయ ప్రక్రియలపై అవగాహన కల్పించడం వంటి సంస్కరణలు కూడా తప్పనిసరి. ఇది వారికి నైపుణ్యాలను పెంపొందించడానికి సహాయపడుతుంది.

ఎం. రమేష్: దివ్యాంగులు రాజకీయ ప్రతినిధులుగా ఎదగాలి అన్నప్పుడు ఎన్నికల్లో పోటీ చేయడం సాధ్యం అవుతుందా? అలాగే వారికి ఏ విధమైన ప్రతినిధులుగా పదవులు లభించాలని మీరు అభిప్రాయపడుతున్నారు?

ప్రొ. శ్రీనివాస్ రావు: ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. వాస్తవానికి దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ అండదండల పరంగా వెనుకబడి ఉన్నారు. సమాజంలో వారిపట్ల సానుభూతి మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అవకాశాలు చాలా తక్కువగా ఉండవచ్చు. ఐతే దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలే ప్రత్యేక కోటాలో అనగా నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించడం ద్వారా వారికి రాజకీయ భాగస్వామ్యం దక్కుతుంది.

ఎం. రమేష్: పార్టీలు దివ్యాంగుల కోసం ప్రత్యేక బృందాలు, శిక్షణ, మార్గదర్శకత్వం వంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతవరకు సాధ్యమవుతుంది?

ప్రొ. శ్రీనివాస్ రావు: ఇది ఖచ్చితంగా సాధ్యమే. కానీ ఇచ్చిన హామీలను నెరవేర్చే నిజమైన సంకల్పం ఉండాలి. పార్టీలు తమ యూత్ సెల్‌లలో, పబ్లిక్ పాలసీ వర్క్‌షాప్‌లలో దివ్యాంగులను భాగస్వాములను చేయాలి. దివ్యాంగుల కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమవడం ద్వారా పార్టీలు ప్రజల విశ్వసనీయత పొందగలవు. ఇది కేవలం ఎన్నికల తంతు కాకుండా, ఒక నిరంతర ప్రక్రియగా మారాలి.

ఎం. రమేష్: ప్రొఫెసర్ గారూ, దివ్యాంగులు ప్రజా ప్రతినిధులుగా ఎదిగిన కొన్ని ప్రేరణాత్మక ఉదాహరణలు చెప్పగలరా? మన యువత, ముఖ్యంగా దివ్యాంగులైన విద్యార్థులు రాజకీయాల్లోకి రావడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.?

ప్రొ. శ్రీనివాస్ రావు: తప్పకుండా. అలాంటి ఉదాహరణలు స్ఫూర్తినిస్తాయి.

సాధన్ గుప్తా - భారతదేశపు మొట్టమొదటి అంధ పార్లమెంటేరియన్. ఆయన న్యాయవాదిగా, ఆ తర్వాత పార్లమెంటేరియన్‌గా దేశానికి సేవలందించారు.

మినాతి బరిక్ - ఒడిశాలో వీల్‌చైర్‌పై ఎన్నికైన తొలి మహిళా సర్పంచ్. స్థానిక స్థాయిలో ఆమె నాయకత్వం ఎంతో మందికి ఆదర్శప్రాయం.

జైపాల్ రెడ్డి - మన తెలంగాణ నుంచే, పోలియో బాధితుడైనప్పటికీ విద్యార్థి నాయకుడిగా ప్రారంభించి కేంద్ర మంత్రిగా సేవలందించారు.

తెలంగాణలో కూడా Youth for Democracy, Student Parliament వంటి వేదికల ద్వారా యువత రాజకీయాల్లోకి వస్తున్నారు. వారి విజయం వెనుక సరైన శిక్షణ, కుటుంబ మద్దతు, ప్రజల విశ్వాసం కీలక పాత్ర పోషిస్తాయి.

**రిజర్వేషన్లు మరియు ఇతర రాష్ట్రాల్లో అమలు:**

ఎం. రమేష్: భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించిన సందర్భాలు ఉన్నాయి. అటువంటి రాష్ట్రాల నుండి ఏవైనా ఉదాహరణలు ఇవ్వగలరా? ఆయా రాష్ట్రాల్లో రిజర్వేషన్లు ఎలా అమలవుతున్నాయి?

ప్రొ. శ్రీనివాస్ రావు: అవును, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలు స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాయి. ఈ రాష్ట్రాల్లో రిజర్వేషన్లు వివిధ శాతం మరియు కేటాయింపు పద్ధతుల్లో అమలవుతున్నాయి.

ఎం. రమేష్: దివ్యాంగుల కోసం రిజర్వేషన్ల శాతం, కేటాయింపు పద్ధతులు ఎలా ఉన్నాయి? ఈ రిజర్వేషన్ల ద్వారా దివ్యాంగులు రాజకీయంగా ఎంతవరకు ప్రయోజనం పొందారు?

ప్రొ. శ్రీనివాస్ రావు: నిర్దిష్ట శాతం మరియు కేటాయింపు పద్ధతులు రాష్ట్రాల బట్టి మారతాయి. ఈ రిజర్వేషన్ల ద్వారా దివ్యాంగులు స్థానిక స్థాయిలో రాజకీయంగా ప్రాతినిధ్యం వహించడానికి, తమ సమస్యలను ప్రస్తావించడానికి కొంతవరకు ప్రయోజనం పొందారు.

ఎం. రమేష్: తెలంగాణ రాష్ట్రంలో కూడా స్థానిక సంస్థలు, శాసనసభ ఎన్నికలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని మీరు భావిస్తున్నారా? ఒకవేళ అవునైతే, దానిని ఎలా అమలు చేయాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: ఖచ్చితంగా. తెలంగాణలో కూడా స్థానిక సంస్థలు, శాసనసభ ఎన్నికలలో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉంది. దీనిని అమలు చేయడానికి చట్టపరమైన సంస్కరణలు తీసుకురావాలి, దివ్యాంగుల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు కేటాయించాలి, మరియు ఈ ప్రక్రియను పారదర్శకంగా అమలు చేయాలి.

ఎం. రమేష్: దివ్యాంగులు చిన్నతనం నుండే రాజకీయాలపై ఆసక్తి పెంచుకోవడానికి, నాయకత్వ లక్షణాలను అలవరుచుకోవడానికి విద్యా వ్యవస్థ ఎలాంటి పాత్ర పోషించాలి? పాఠశాల మరియు కళాశాల స్థాయిల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషించాలి. పాఠశాల, కళాశాల స్థాయిల్లో నాయకత్వ శిక్షణ కార్యక్రమాలు, రాజకీయ ప్రాముఖ్యతపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. పాఠ్యప్రణాళికలో దివ్యాంగుల హక్కులు, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలను చేర్చడం ద్వారా చిన్నతనం నుండే వారిలో ఆసక్తిని పెంపొందించవచ్చు.

ఎం. రమేష్: సమాజంలో దివ్యాంగుల సామర్థ్యాలపై, రాజకీయాల్లో వారి పాత్రపై ఉన్న అపోహలు, మూఢనమ్మకాలు తొలగించడానికి ఎలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరం? మీడియా పాత్ర ఇందులో ఎంత కీలకం?

ప్రొ. శ్రీనివాస్ రావు: దివ్యాంగుల సామర్థ్యాలపై, రాజకీయాల్లో వారి పాత్రపై ఉన్న అపోహలను తొలగించడానికి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. మీడియా ఇందులో కీలక పాత్ర పోషిస్తుంది. దివ్యాంగుల సానుకూల విజయ గాథలను ప్రచురించడం, వారి నాయకత్వ లక్షణాలను హైలైట్ చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చు.

**రాజకీయ పార్టీల పాత్ర మరియు అంతర్గత మార్పులు:**

ఎం. రమేష్: రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు దివ్యాంగులకు తమ పార్టీల్లో పదవులు, బాధ్యతలు కల్పించడంలో ఎంతవరకు చిత్తశుద్ధి చూపుతున్నాయి? కేవలం ఎన్నికల సమయంలోనే దివ్యాంగులను గుర్తు చేసుకుంటున్నారనే విమర్శలపై మీ అభిప్రాయం ఏమిటి?

ప్రొ. శ్రీనివాస్ రావు: దురదృష్టవశాత్తు, చాలా రాజకీయ పార్టీలు దివ్యాంగులకు పదవులు, బాధ్యతలు కల్పించడంలో చిత్తశుద్ధి లోపించిందని చెప్పాలి. కేవలం ఎన్నికల సమయంలోనే దివ్యాంగులను గుర్తు చేసుకుంటున్నారనే విమర్శలు నిజమే. పార్టీలు దివ్యాంగులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయనే భావన ఉంది.

ఎం. రమేష్: రాజకీయ పార్టీలు తమ ప్రణాళికలలో (Manifestos) దివ్యాంగుల సమస్యలు, వారి రాజకీయ సాధికారతకు సంబంధించిన అంశాలను ఎంతవరకు పొందుపరుస్తున్నాయి? దీనిపై మీరు ఎలాంటి మార్పులు ఆశిస్తున్నారు?

ప్రొ. శ్రీనివాస్ రావు: రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలలో దివ్యాంగుల సమస్యలను అంతగా పొందుపరచడం లేదు. వారి రాజకీయ సాధికారతకు సంబంధించిన అంశాలను మరింత ప్రాధాన్యతతో చేర్చాలి. దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన స్పష్టమైన హామీలు, పథకాలు మేనిఫెస్టోలలో ఉండాలి.

ఎం. రమేష్: రాజకీయ పార్టీలు దివ్యాంగుల కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం, వారికి శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం ఎంతవరకు సాధ్యం? ఇది వారి రాజకీయ ఎదుగుదలకు ఎలా దోహదపడుతుంది?

ప్రొ. శ్రీనివాస్ రావు: రాజకీయ పార్టీలు దివ్యాంగుల కోసం ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయడం, వారికి శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం సాధ్యమే మరియు చాలా అవసరం. ఇది దివ్యాంగుల రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుంది. వారికి ఆత్మవిశ్వాసం కల్పిస్తుంది, నాయకత్వ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది మరియు రాజకీయ ప్రక్రియలో చురుకుగా పాల్గొనడానికి సహాయపడుతుంది.

**చట్టబద్ధమైన మరియు రాజ్యాంగపరమైన అంశాలు:**

ఎం. రమేష్: భారత రాజ్యాంగం, దివ్యాంగుల హక్కుల చట్టం (Rights of Persons with Disabilities Act, 2016) దివ్యాంగుల రాజకీయ భాగస్వామ్యంపై ఎలాంటి నిబంధనలను కలిగి ఉన్నాయి? ఈ చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: భారత రాజ్యాంగం ప్రత్యక్షంగా దివ్యాంగుల రాజకీయ భాగస్వామ్యంపై నిర్దిష్ట నిబంధనలను కలిగి ఉండనప్పటికీ, సమానత్వం, వివక్ష లేకపోవడం వంటి ప్రాథమిక హక్కులను అందిస్తుంది. దివ్యాంగుల హక్కుల చట్టం (Rights of Persons with Disabilities Act, 2016) దివ్యాంగుల హక్కులను పరిరక్షించడానికి అనేక నిబంధనలను కలిగి ఉంది. ఈ చట్టాలను మరింత పటిష్టంగా అమలు చేయడానికి దివ్యాంగులకు రాజకీయ విద్యను అందించడం, ఎన్నికల ప్రక్రియను వారికి అందుబాటులోకి తీసుకురావడం వంటివి చేయాలి.

ఎం. రమేష్: రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఒక హక్కుల కమిషన్ లేదా పర్యవేక్షక సంస్థ అవసరం అని మీరు భావిస్తున్నారా? అది వారికి రాజకీయంగా ఎదురయ్యే అడ్డంకులను పరిష్కరించడంలో ఎలా సహాయపడుతుంది?

ప్రొ. శ్రీనివాస్ రావు: అవును, రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఒక హక్కుల కమిషన్ లేదా పర్యవేక్షక సంస్థ అవసరం. ఇది వారికి రాజకీయంగా ఎదురయ్యే అడ్డంకులను పరిష్కరించడంలో, వారి హక్కులను పరిరక్షించడంలో, మరియు ప్రభుత్వ విధానాలపై పర్యవేక్షణ చేయడంలో సహాయపడుతుంది.

**వ్యక్తిగత అనుభవాలు (ఉదాహరణలు):**

ఎం. రమేష్: దివ్యాంగులైన ఏ నాయకులైనా, ప్రజా ప్రతినిధులైనా తెలంగాణలో లేదా ఇతర ప్రాంతాలలో విజయవంతంగా పనిచేసి, ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా? వారి విజయానికి కారణాలు ఏమిటి?

ప్రొ. శ్రీనివాస్ రావు: నిర్దిష్ట ఉదాహరణలు లేవు. కానీ, దేశవ్యాప్తంగా కొంతమంది దివ్యాంగులైన నాయకులు తమ పట్టుదల, ప్రజలతో మమేకం కావడం, తమ సమస్యలను సమర్థవంతంగా వినిపించడం ద్వారా విజయం సాధించారు.

ఎం. రమేష్: రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న దివ్యాంగులకు మీరు ఇచ్చే ప్రధాన సూచనలు, సలహాలు ఏమిటి? వారు ఎలాంటి అంశాలపై దృష్టి సారించాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న దివ్యాంగులు తమ హక్కులు, చట్టాలు, మరియు రాజకీయ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. స్థానిక సమస్యలపై దృష్టి సారించడం, సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేయడం, మరియు తమ సమస్యలను సమర్థవంతంగా వినిపించడం వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఆత్మవిశ్వాసం, పట్టుదల చాలా ముఖ్యం.

**భవిష్యత్ ఆశలు మరియు కార్యాచరణ:**

ఎం. రమేష్: రాబోయే 5-10 సంవత్సరాలలో తెలంగాణ రాజకీయాల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం ఎలా ఉండాలని మీరు ఆశిస్తున్నారు? ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి తక్షణమే చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలు ఏమిటి?

ప్రొ. శ్రీనివాస్ రావు: రాబోయే 5-10 సంవత్సరాలలో తెలంగాణ రాజకీయాల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం గణనీయంగా పెరగాలని ఆశిస్తున్నాను. స్థానిక సంస్థలు, శాసనసభల్లో వారికి తగిన రిజర్వేషన్లు కల్పించడం, రాజకీయ పార్టీలు వారికి అవకాశాలు కల్పించడం, మరియు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వంటి కార్యాచరణ ప్రణాళికలు అవసరం.

ఎం. రమేష్: స్థానిక మరియు జాతీయ మీడియా దివ్యాంగుల రాజకీయ ఆకాంక్షలను, వారి సమస్యలను ఎంతవరకు కవర్ చేస్తోంది? మీడియాలో వారి సానుకూల ప్రాతినిధ్యం (positive representation) పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? మీడియా దివ్యాంగులను బాధితులుగా కాకుండా, సామర్థ్యం ఉన్న నాయకులుగా చిత్రించడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: స్థానిక మరియు జాతీయ మీడియా దివ్యాంగుల రాజకీయ ఆకాంక్షలను, వారి సమస్యలను అంతగా కవర్ చేయడం లేదని చెప్పాలి. మీడియాలో వారి సానుకూల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి దివ్యాంగుల విజయాలను ప్రచారం చేయాలి, వారి నాయకత్వ లక్షణాలను హైలైట్ చేయాలి. బాధితులుగా కాకుండా, సామర్థ్యం ఉన్న నాయకులుగా వారిని చిత్రించడానికి పాత్రికేయులకు ప్రత్యేక శిక్షణ అవసరం.

**అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు మరియు స్ఫూర్తి:**

ఎం. రమేష్: అంతర్జాతీయంగా దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఏవైనా విజయవంతమైన నమూనాలు (successful models) ఉన్నాయా? ఉదాహరణకు విదేశీ పార్లమెంట్‌లలో దివ్యాంగుల ప్రత్యేక కోటాలు, వారి కోసం కేటాయించిన సీట్లు. ఆ నమూనాల నుండి తెలంగాణ ఏం నేర్చుకోవచ్చు?

ప్రొ. శ్రీనివాస్ రావు: అంతర్జాతీయంగా దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం కొన్ని విజయవంతమైన నమూనాలు ఉన్నాయి. కొన్ని విదేశీ పార్లమెంట్‌లలో దివ్యాంగుల కోసం ప్రత్యేక కోటాలు, సీట్లు కేటాయిస్తున్నారు. ఈ నమూనాల నుండి తెలంగాణ దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించడం, రాజకీయాల్లో వారికి ప్రత్యేక శిక్షణ అందించడం వంటివి నేర్చుకోవచ్చు.

ఎం. రమేష్: యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ (UNCRPD) వంటి అంతర్జాతీయ ఒప్పందాలు దివ్యాంగుల రాజకీయ భాగస్వామ్యంపై ఎలాంటి సిఫార్సులు చేస్తున్నాయి? భారతదేశం వాటిని ఎంతవరకు పాటిస్తోంది?

ప్రొ. శ్రీనివాస్ రావు: యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ (UNCRPD) దివ్యాంగుల రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి స్పష్టమైన సిఫార్సులు చేస్తుంది. భారతదేశం ఈ ఒప్పందంలో భాగమైనప్పటికీ, అమలులో ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది.

**ఆర్థిక స్వయం సమృద్ధి మరియు రాజకీయ ప్రవేశం:**

ఎం. రమేష్: రాజకీయాల్లోకి రావాలనుకునే దివ్యాంగులకు ఆర్థిక అండదండలు ఎలా కల్పించాలి? వారి కోసం ప్రత్యేక నిధులు, గ్రాంట్లు లేదా తక్కువ వడ్డీ రుణాలు అందించే వ్యవస్థ అవసరమా?

ప్రొ. శ్రీనివాస్ రావు: రాజకీయాల్లోకి రావాలనుకునే దివ్యాంగులకు ఆర్థిక అండదండలు కల్పించడం చాలా అవసరం. వారి కోసం ప్రత్యేక నిధులు, గ్రాంట్లు, లేదా తక్కువ వడ్డీ రుణాలు అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఎం. రమేష్: దివ్యాంగులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడం వారి రాజకీయ ఎదుగుదలకు ఎలా దోహదపడుతుంది? ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: దివ్యాంగులు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడం వారి రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుంది. ఆర్థిక స్థిరత్వం వారికి రాజకీయాల్లో చురుకుగా పాల్గొనే ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి అవకాశాలను కల్పించడం, నైపుణ్య శిక్షణ ఇవ్వడం, మరియు స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలి.

ఎం. రమేష్: తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల దివ్యాంగుల సంఘాలు, సంస్థలు ఉన్నాయి. ఇవి సమన్వయంతో పని చేస్తూ, దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలి?

ప్రొ. శ్రీనివాస్ రావు: తెలంగాణలోని దివ్యాంగుల సంఘాలు, సంస్థలు సమన్వయంతో పనిచేయడం ద్వారా దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం ప్రభుత్వాలపై సమర్థవంతంగా ఒత్తిడి తీసుకురాగలవు. ఇందుకోసం ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేసుకోవడం, ప్రభుత్వంతో చర్చలు జరపడం, మరియు ప్రజా ఉద్యమాలను నిర్వహించడం వంటి వ్యూహాలను అనుసరించాలి.

ఎం. రమేష్: దివ్యాంగుల సంఘాలు ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలతో చర్చలు జరిపి, తమ డిమాండ్లను మేనిఫెస్టోలలో చేర్చడానికి ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయి?

ప్రొ. శ్రీనివాస్ రావు: దివ్యాంగుల సంఘాలు ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలతో చర్చలు జరిపి, తమ డిమాండ్లను మేనిఫెస్టోలలో చేర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సంఘాలు తమ డిమాండ్లను స్పష్టంగా రూపొందించుకోవడం, వాటిని రాజకీయ పార్టీలకు సమర్పించడం, మరియు వాటి అమలుకు హామీలు తీసుకోవడం వంటివి చేయాలి.

"దివ్యాంగుల రాజకీయ భాగస్వామ్యం ఓటు వేసే చేతులే కాదు, నిర్ణయాల్లోనూ పాల్గొనాలి!"

ఎం. రమేష్: RPWD చట్టం (2016) వంటి చట్టాలు దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ఎంతవరకు ప్రయోజనకరంగా ఉన్నాయని మీరు భావిస్తున్నారు?

ప్రొ. శ్రీనివాసరావు: చూడండి, కాగితం మీద RPWD Act (2016) చక్కటి హక్కుల భద్రతను కల్పిస్తుంది. కానీ అమలు స్థాయిలో ఇంకా అనేక లోపాలున్నాయి. ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి సరైన శిక్షణ, అవగాహన, పారదర్శకత లోపిస్తే ఆ చట్టం కేవలం ఒక పుస్తకంలోనే ఉండిపోతుంది తప్ప, నిజ జీవితంలో దాని ప్రయోజనం కనిపించదు. అందుకే చట్టం ఉండటంతో పాటు, దాని సక్రమమైన అమలుకు నిరంతర పర్యవేక్షణ అవసరం.

ఎం. రమేష్: తిరిగి RPWD చట్టం (2016) విషయానికి వస్తే, ఈ చట్టం దివ్యాంగుల రాజకీయ భాగస్వామ్యానికి ఎలా సహాయపడుతుంది? దాని అమలులో ఉన్న సవాళ్లు ఏమిటి?

ప్రొ. శ్రీనివాసరావు: RPWD చట్టం (2016) ప్రకారం, ప్రభుత్వానికి దివ్యాంగులకు ప్రాతినిధ్యం, అందుబాటు, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉంది. ఇది దివ్యాంగుల రాజకీయ హక్కులను బలోపేతం చేస్తుంది. ఉదాహరణకు, పోలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తేవడం, ఎన్నికల ప్రక్రియను సులభతరం చేయడం వంటివి ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. కానీ తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు కాకపోవడం ఈ చట్టం అమలులో ఉన్న లోపాలను స్పష్టంగా చూపిస్తుంది. ఈ చట్టం గురించి విస్తృత చర్చ జరగాలి, అమలు స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

ఎం. రమేష్: దివ్యాంగుల కోసం హక్కుల కమిషన్ లేదా పర్యవేక్షణ సంస్థ ఏర్పాటు చేయడం ఎంతవరకు సాధ్యమవుతుంది? దాని అవసరం ఏమిటి?

ప్రొ. శ్రీనివాసరావు: ఇది ఖచ్చితంగా సాధ్యమే మరియు అత్యవసరం. ఇప్పటికే దివ్యాంగుల సంక్షేమ శాఖ, కమిషనర్ కార్యాలయం పనిచేస్తోంది. అయితే, పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, దివ్యాంగుల ప్రతినిధుల ఎంపిక, వారి హక్కుల పరిరక్షణ వంటి అంశాల్లో ఒక స్వతంత్ర సంస్థ అవసరం ఉంది. ఇది రాజకీయంగా ఎదగడానికి, అడ్డంకులను అధిగమించడానికి దివ్యాంగులకు కీలకంగా ఉంటుంది. అటువంటి సంస్థ పక్షపాత రహితంగా, సమర్థవంతంగా పనిచేయాలి.

ఎం. రమేష్: ప్రొఫెసర్ గారూ, దివ్యాంగుల సంక్షేమం, రాజకీయ భాగస్వామ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం ఇంకా ఎలాంటి సానుకూల వైఖరిని ప్రదర్శించవచ్చు? భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ఎలా ఉండాలి?

ప్రొ. శ్రీనివాసరావు: ఇది చాలా సమయోచితమైన ప్రశ్న రమేష్ గారూ. తెలంగాణలో దివ్యాంగులు తమ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. వారి ప్రధాన డిమాండ్లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఒకటి. నిజానికి, RPWD చట్టం (2016) ప్రకారం వారికి ఇది చట్టబద్ధమైన హక్కు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఇంకా స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తే, గ్రామీణ, పట్టణ స్థాయిల్లో దివ్యాంగులు తమ సమస్యలను నేరుగా ప్రజా ప్రతినిధులుగా ప్రస్తావించడానికి, వాటి పరిష్కారానికి కృషి చేయడానికి అవకాశం లభిస్తుంది. ఇది వారి రాజకీయ భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. RPWD చట్టం (2016) లోని ప్రతి అంశాన్ని పటిష్టంగా అమలు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను అమలు చేయాలి.

**ముగింపు:**

ఎం. రమేష్: ధన్యవాదాలు సార్! దివ్యాంగుల రాజకీయ ప్రాతినిధ్యంపై మీరు అందించిన సమాచారం ప్రభుత్వం, రాజకీయ పార్టీలు అమలు చేస్తే గనుక దివ్యాంగుల సామాజిక అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. అంతే కాక ఈ సమాచారం ప్రజల్లో.. ప్రత్యేకంగా దివ్యాంగుల్లో, ప్రజా సంఘాల్లో అవగాహన పెంచుతుందని ఆశిస్తున్నాం.

ప్రొ. శ్రీనివాస్ రావు: ధన్యవాదాలు రమేష్ గారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచడం చాలా అవసరం. దీనికి పూనుకున్న తీన్మార్ దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదములు.

# గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్‌లు

- వందమంది పిల్లలు ప్రాణాలు పోయినా లెక్కలేదు
- సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు





**హైదరాబాద్, జూలై 21:** ఢిల్లీకి చక్కర్లు కొట్టడం తప్ప, రాష్ట్రంలో పరిపాలనను చక్కదిద్దడం చేతగాదా అని సిఎం రేవంత్ రెడ్డిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 20నెలల కాంగ్రెస్ పాలనలో పాము కాట్లు, ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజనింగ్‌లతో 100కు పైగా గురుకుల విద్యార్థులు ప్రాణాలు కోల్పోతే ఎందుకు సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ గురుకులాల ఖ్యాతిని ఎవరెస్ట్ శిఖరం ఎత్తున నిలబెడితే.. రేవంత్ రెడ్డి అధఃపాతాళానికి దిగజార్చాడని విమర్శించారు. ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోతే మీ రాతి గుండె కరుగుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా, నారాయణ్ ఖేడ్, నాగల్ గిద్ద మోడల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామం గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం గురుకుల కళాశాలలో ఫుడ్ పాయిజన్.. ఇలా 48 గంటల్లో జరిగిన ఈ ఫుడ్ పాయిజన్ ఘటనలు కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనాలు అని విమర్శించారు. ప్రతిపక్షాలపై నోరు పారేసుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రోజురోజుకీ దిగజారుతున్న గురుకులాల దీనస్థితి కనిపించడం లేదా అని హరీశ్ రావు ప్రశ్నించారు. వరుసగా ఫుడ్ పాయిజన్లు జరిగి పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రి పాలవుతుంటే మనస్సు కరగడం లేదా అని నిలదీశారు. కేసీఆర్ గుర్తులు చెరిపేయాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి గురుకులాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుండటం చారిత్రక నేరమని విమర్శించారు. సంకుచిత మనస్తత్వంతో దళిత, గిరిజన, బడుగు, మైనార్టీ వర్గాల పిల్లలు చదువుకునే గురుకులాల ఖ్యాతికి గ్రహణం పట్టిస్తుండటం దుర్మార్గమని అన్నారు. స్వయంగా తానే మానిటరింగ్ చేస్తానని బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, మీ మానిటరింగ్ ఏమైంది? విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండి మీరు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు.

# సూర్యాపేట బంగారం షాపులో భారీ చోరీ




**సూర్యాపేట, జూలై 21 :** సూర్యాపేటలోని సాయి సంతోషి నగల దుకాణంలో భారీ చోరీ చోటుచేసుకుంది. భారీగా నగలు,నగదు దోచుకున్నారు. 18 కిలోల బంగారం, రూ.22 లక్షల నగదు చోరీ జరిగిందని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణం వెనుక నుంచి గ్యాస్ కట్టర్‌తో షట్టర్ తొలగించి దొంగలు లోనికి ప్రవేశించినట్లు- చెప్పారు. ఘటనాస్థలికి చేరుకుని పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. చోరీ జరిగిన దుకాణాన్ని ఎస్పీ నరసింహ పరిశీలించారు. మొత్తం 5 బృందాలను ఏర్పాటు- చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు- తెలిపారు. షాప్ యజమాని కిశోర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు- వెల్లడించారు. చోరీ జరిగిన బంగారం వివరాలు సేకరిస్తున్నట్లు- చెప్పారు. దొంగలు రెక్కీ నిర్వహించి ఈ చోరీకి పాల్పడినట్లు- తెలుస్తోందని ఎస్పీ పేర్కొన్నారు.




# రియల్ విభేదాలే అనిల్ హత్యకు కారణం

## సొంత స్నేహితులే మట్టుబెట్టినట్లు నిర్ధారణ



**మెదక్, జూలై 21 :** మెదక్ జిల్లా కాంగ్రెస్ నేత అనిల్ హత్య కేసును పోలీసులు ఛేధించారు. ఆస్తి,పాతకక్షల వల్లే అనిల్ ను హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డిగా గుర్తించారు. హత్యకు గురైన అనిల్ గతంలో రవీందర్ రెడ్డి అనుచరుడిగా ఉండేవాడు. ఇద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు. ఈ కేసులో ఏ 1 కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి. ఏ2 నాగరాజు, ఏ 3 నాగభూషణంగా పోలీసులు చేర్చారు. మెదక్ ఎస్పీ శ్రీనివాస రావు చెప్పిన వివరాల ప్రకారం.. జులై 14న రాత్రి కాంగ్రెస్ నేత అనిల్ ను మెదక్, సంగారెడ్డి రూట్లో కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో కాల్పులు జరిపి హత్య చేశారు. ఈ కేసులో ఏ 1 కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి. ఏ2 నాగరాజు, ఏ 3 నాగభూషణం చేర్చారు పోలీసులు. ఈ ముగ్గురికి అనిల్ అంటే ద్వేషం ఉంది. అనిల్ హైదరాబాద్ సహా పలుచోట్ల ల్యాండ్ సెటిల్ మెంట్లు చేశాడు. కాంగ్రెస్ నేత రవీందర్ రెడ్డి అతని భార్య లక్ష్మీ లకు అనిల్ అనుచరుడిగా ఉన్నారు. లక్ష్మీ మరణం తర్వాత రవీందర్ రెడ్డికి, అనిల్ కు విభేదాలు వచ్చాయి. పెట్రోల్ బంకు విషయంలో ఇద్దరికి గొడవలు జరుగుతున్నాయి. రవీందర్ రెడ్డి కి సంబంధించిన 12 ఎకరాల భూమి విషయంలో ఇద్దరి మధ్య వివాదం ఉంది. గ్రామంలోనూ తనపై అనిల్ దుష్ప్రచారం చేస్తున్నారని రవీందర్ రెడ్డి కోపం పెంచుకున్నాడు. మరో ఇద్దరు నాగభూషణం, నాగరాజులకు కూడా అనిల్ తో గొడవలు ఉన్నాయి. అనిల్ తో పాటు- శేఖర్, నాగభూషణం అనే వ్యక్తి జులై14న గాంధీ భవన్ కి వెళ్లారు. హైదరాబాద్ లో ఓ సెటిల్ మెంట్ కోసం ముగ్గురు కలిసి వెళ్లారు. హత్య జరిగే వరకు నిందితులు అనిల్ తోనే ఉన్నారు. ఓ ఆల్టో కారు, మరో కారులో అప్పటికే అనిల్ ని హత్య చేయాలని ప్లాన్ చేసుకున్నారు. వరిగుంతం వద్ద షాబుద్దిన్ అనే వ్యక్తి అనిల్ పై కాల్పులు జరిపి హత్య చేశారు. అనిల్ హత్యకు ప్రధాన కారణం పాత కక్షలు, విబేధాలు. ఒకప్పుడు అనిల్ స్నేహితులే శత్రువులయ్యారు. ఈ కేసులో ఐదుగురు నిందితులని అరెస్ట్ చేశాం. ఇద్దరు పరారీలో ఉన్నారు. వారిని త్వరలో పట్టుకుంటాం అని ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

# పార్లమెంట్‌లో వ్యూహంపై మోడీ చర్చలు

## మంత్రులతో ప్రధాని సమీక్ష

**న్యూఢిల్లీ,జూలై21:** పార్లమెంటు- సమావేశాల్లో తొలిరోజు గందరగోళ పరిస్థితి నెలకొంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సింధూర్, అహ్మదాబాద్ విమాన ప్రమాదాలపై మోడీ స్పందించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళం నెలకొంది. ఈ సమయంలోనే ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన పార్లమెంట్ హౌస్‌లో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయ మంత్రి అర్జున్ మేఘ్వాల్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తోపాటు- పలువురు మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో సభ అజెండాలు, ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైన ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. పలు కీలకమైన బిల్లును ఆమోదింపజేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపైన చర్చించినట్లు తెలుస్తున్నది. అయితే ఈ సమావేశ అజెండాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

# ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల చర్చ

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటన



**న్యూఢిల్లీ,జూలై21:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజే హాట్ హాట్‌గా సమావేశాలు మొదలయ్యాయి. ఆపరేషన్ సిందూర్, బీహార్ ఎన్నికల పక్రియ, పలు అంశాలపై విపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. దీంతో పలుమార్లు ఉభయ సభలు వాయిదా పడ్డాయి. తొలి రోజంతా వాయిదాల పర్వమే కొనసాగింది. పహల్గామ్ ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని పార్లమెంట్ ఉభయ సభల్లో కాంగ్రెస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయడంతో పాటు- పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించినట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే చెప్పడంపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. అయితే చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. అయినా కూడా ఆందోళనలు జరగడంతో సభ వాయిదాలు పడింది. తాజాగా ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు స్పీకర్ ఓం బిర్లా సమయం కేటాయించారు. 16 గంటల పాటు- చర్చకు అనుమతిచ్చారు. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో తొమ్మిది గంటలు చర్చించనున్నారు. అలాగే కొత్త పన్ను బిల్లుకు 12 గంటల సమయం కేటాయించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే మాట్లాడుతూ.. పహల్గామ్‌లో దాడి చేసిన ఉగ్రవాదుల్ని ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. కాల్పుల విరమణకు మధ్వర్తిత్వం వహించింది తానేనని పదే పదే ట్రంప్ ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. ఇం-టె-లిజెన్స్ వైఫల్యం జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ ప్రకటన చేశారని గుర్తుచేశారు. ఇక ప్రతిపక్షాల సహకారం కోరుతూ ఆపరేషన్ సిందూర్ గురించి చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఏ అంశం నుంచి కూడా ప్రభుత్వం దూరంగా ఉండదని చెప్పారు.

# హెచ్‌సీఏ అక్రమాల్లో కేటీఆర్, కవిత

## తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి



**హైదరాబాద్, జూలై 21:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల్లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత ప్రమేయముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. పదేళ్లుగా రాష్ట్రంలోని క్రికెట్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారని.. చాలా మందికి క్రికెటర్లకు గుర్తింపు లేకుండా చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్, కవితతో పాటు హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంపత్‌కుమార్‌ను తక్షణమే విచారించాలి. వారి తప్పుడు నిర్ణయాల వల్ల గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరిగింది. సమ్మర్ క్యాంపులను ఉచితంగా నిర్వహించాలి. కానీ డబ్బులు తీసుకున్నారు. దానికి మా వద్ద ఆధారాలున్నాయి. ఆ డబ్బంతా ఎక్కడికి పోయింది. అవకాశాల కోసం తెలంగాణ క్రికెటర్లు ఎదురు చూస్తున్నారు. హెచ్‌సీఏలో జరిగిన అక్రమాల వివరాలను సీఐడీ, ఈడీకి అందజేస్తాం. హెచ్‌సీఏ కార్యవర్గాన్ని రద్దు చేయాలి. హెచ్‌సీఏ ఎన్నికపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. క్రికెట్‌తో సంబంధం లేని జగన్మోహన్‌రావు ఎలా అధ్యక్షుడు అయ్యారు?ఆయన వెనుక కేటీఆర్, కవిత ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా ఓట్లు వేస్తారు?ఐపీఎస్ అధికారి సజ్జనార్ కూడా ఎన్నికల్లో పాల్గొన్నారు. 155 క్రికెట్ అసోసియేషన్లు యాక్టివ్‌లో లేవు. అలాంటి వాటికి ఎన్నికలు ఎలా నిర్వహించారు?వెంటనే ఎన్నికలు రద్దు చేసి క్లబ్బులను ప్రక్షాళన చేయాలని గురువారెడ్డి డిమాండ్ చేశారు.

# ఉద్దేశ్యపూర్వకంగానే నాపై దాడి

## పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## పార్టీకి చెందిన వారే దాడికి పాల్పడ్డారు

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆరోపణ



**హైదరాబాద్, జూలై 21:** ఆదివారం రాత్రి తనపై జరిగిన దాడి యత్నంపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ స్పందించారు. సోమవారం ఉదయం సికింద్రాబాద్ ఎమ్మెల్యే మాట్లాడారు. తనపై ఉద్దేశ్యపూర్వకంగానే దాడి ప్రయత్నం జరిగిందని, తనకు కొందరిపై అనుమానం ఉందని తెలిపారు. తన నియోజకవర్గంలో తన పార్టీకి చెందిన ఓ నేత టార్గెట్ చేశారని స్పష్టం చేశారు. సదరు నేత రౌడీయిజం చేస్తాడని, గతంలో అతనిపై హత్య కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. తనపై దాడికి ప్రయత్నం చేసిన వారంతా బయట నియోజకవర్గానికి చెందిన వారే అని, అందులో కొందరిని తాను గుర్తుపడుతా అని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ చెప్పారు. మళ్లీ పోలీసులను కలిసి అన్ని వివరాలు రెండు రోజులో చెప్తా. పోలీసులు కేసు పారదర్శకంగా దర్యాప్తు చేయకపోతే నేనే వారి పేర్లు బయటపెడతా' అని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ తెలిపారు. మా గన్‌మెన్‌ల గన్స్ లాక్కున్నారా లేదా అని నేను చూడలేదు. నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను. సీసీ కెమెరాల ద్వారా కేసు దర్యాప్తు చేస్తున్నారు. తాను రోడ్డుపై కారులో వెళ్తున్నాను. మా కార్ సైరన్ కొట్టిన మాట వాస్తవమే. సైరన్ కొడితే డ్రైవర్ దగ్గరికి రావాలి, డ్రైవర్‌పై అటాక్ జరగాలి. కానీ నన్ను ఎందుకు టార్గెట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మా ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉంది. మా ప్రభుత్వం ఇలాంటి రౌడీయిజాన్ని చూస్తూ ఊరుకోదని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ హెచ్చరించారు. మాణికేశ్వర్ నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యేపై ఆదివారం రాత్రి దుండగులు దాడికి యత్నించారు.

# కల్లు దుకాణాలు బంద్ చేస్తే ఊరుకోం

## బంద్ పెడితే అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం

## మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్, జూలై 21:** కులవృత్తుల బాగోగులపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కులవృత్తులను పూర్తిగా భూస్థాపితం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్తీ పేరిట పూర్తిగా గీత వృత్తిని రూపు మాపేయాలన్న ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. కల్లు దుకాణాలు బంద్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గౌడ సమస్యల విషయంలో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో గౌడ కులస్తులపై నిషేధం విధించారు. 60 మంది గౌడ కుల స్త్రీలు గుడికి వెళ్తే గుళ్లోకి రావద్దని వెనక్కి పంపారు. లక్షలు, లక్షలు మామూళ్లు తీసుకుని కల్లు దుకాణాలు బంద్ చేస్తామంటే చూస్తూ ఊరుకోం. కల్లు దుకాణాలు బంద్ పెడితే బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద మామూళ్లు తీసుకుంటున్న ఎమ్మెల్యేల పేర్లు బయటపెడతాం అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శ్రీకాంత్‌పై జరిగిన దాడికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కల్లు అనేది ప్రకృతి పానీయమని, అలాంటి కల్లుని నిషేధించాలని ప్రభుత్వం చూస్తోందని కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ అన్నారు. కల్తీ కల్లును కచ్చితంగా అరికట్టాలి. కానీ ఆ పేరుతో కల్లును నిషేదిస్తే ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అని ఆయన హెచ్చరించారు. కల్లు మండువాలు, కల్లు గీత కార్మికుల జోలికి వస్తే రాజకీయంగా సంగతి తెలుస్తామన్నారు. నీరా కేఫ్‌ను హైదరాబాద్ నగరంలో పెడితే కాంగ్రెస్ వచ్చాక ఆగం చేసిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గట్టు రాంచందర్ రావు, నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# అత్యాధునికంగా ఖమ్మం మార్కెట్ అభివృద్ధి : మంత్రి తుమ్మల



**ఖమ్మం, జూలై 21:** రాష్ట్రంలో ఖమ్మం మార్కెట్‌ను మోడల్ మార్కెటింగ్ గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..రూ.150 కోట్లతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. మార్కెట్ చుట్టూ 6 గేట్లు ఏర్పాటు- చేయాలని తుమ్మల అధికారులకు సూచించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో అన్ని వసతులూ ఏర్పాటు- చేస్తున్నామని, సంక్రాంతి నాటికి మార్కెట్ పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. మార్కెట్ విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇస్తామని, మార్కెట్ చుట్టూ ఆహ్లాదకరమైన పరిస్థితి ఉండేలా చూస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# మరో ఆసక్తికర పోరుకు టీమిండియా సిద్ధం

## మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్ట్ ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనున్న భారత్



ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో 1-2తో వెనుకంజలో నిలిచిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. బుధవారం నుంచి మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్ట్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. 11 ఏళ్ల తర్వాత మాంచెస్టర్ వేదికగా టీమిండియా టెస్ట్ మ్యాచ్ ఆడుతుంది. ఈ సిరీస్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించడం కీలకం. ఓడినా.. డ్రా అయినా సిరీస్ గెలిచే అవకాశాలను టీమిండియా కోల్పోతుంది. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ విజయం కోసం టీమిండియా గత 18 ఏళ్లుగా నిరీక్షిస్తోంది. 2007లో చివరిసారిగా భారత్.. ఇంగ్లండ్ గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచింది. అయితే మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో భారత్‌కు మెరుగైన రికార్డ్స్ లేవు. ఈ మైదానంలో భారత్ ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. మొత్తం 9 మ్యాచ్‌లు ఆడిన భారత్ ఐదు మ్యాచ్‌లు డ్రా చేసుకొని నాలుగింటిలో ఓడింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధిస్తే 89 ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. 1936లో మహరాజ కెప్టెన్సీలో భారత్ మాంచెస్టర్‌లో టీమిండియా తొలి మ్యాచ్ ఆడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కటి గెలవలేదు. నాలుగో టెస్ట్‌లోనూ టీమిండియా ఓటమిపాలైతే.. ఒకే వేదికగా 10 ప్లస్ మ్యాచ్‌లు ఆడి ఒక విజయం సాధించిన జట్టుగా అప్రతిష్టను మూటగట్టుకుంటుంది. ప్రస్తుతం భారత్ మాంచెస్టర్‌తో పాటు బార్బోడస్ వేదికగా తొమ్మిదేసి మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం సాధించలేదు. మరే జట్టు కూడా ఇలాంటి ఫీట్ నమోదు చేయలేదు. ఈ జాబితాలో ప్రస్తుతం ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక భారత్‌తో సమంగా ఉన్నాయి. ఆస్ట్రేలియా.. కరాచీ వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి ఐదింటిలో ఓడి 4 డ్రా చేసుకుంది. బంగ్లాదేశ్ డాకా వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి ఏడింటిలో ఓడి 2 డ్రా చేసుకుంది. బార్బోడస్‌లో భారత్ 9 మ్యాచ్‌లు ఆడి ఏడింటిలో ఓడి 2 డ్రా చేసుకుంది. మాంచెస్టర్‌లో భారత్ 9 మ్యాచ్‌లు ఆడి నాలుగింటిలో ఓడటంతో పాటు ఐదింటిలో ఓటమి తప్పించుకుంది. శ్రీలంక లండన్ వేదికగా 9 మ్యాచ్‌లు ఆడి మూడింటిలో ఓడి 6 డ్రా చేసుకుంది.

## బీసీసీఐ ప్రెసిడెంట్ రేసులో ఆ ఇద్దరు?



బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీకి జులై 19తో 70ఏళ్లు నిండాయి. దీంతో బోర్డు రాజ్యాంగం ప్రకారం గరిష్ఠ వయోపరిమితి దాటడంతో బిన్నీ తన పదవికి అనర్హుడువుతారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ లో జరిగే వార్షిక సర్వసభ్య సాధారణ సమావేశం..వరకు బిన్నీ కొనసాగుతాడా లేదా ఉపాధ్యాక్షుడు రాజీవ్ శుక్లాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించి ఆయన తప్పుకుంటాడా అనే విషయంపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. అంతేకాదు జాతీయ క్రీడా బిల్లు ముసాయిదా రూపంలో మరో ట్విస్ట్ బిన్నీకి అనుకూలంగా మారే ఛాన్స్ కనిపిస్తోంది. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో నూతన క్రీడా బిల్లును ప్రవేశపెడతారు. ఈ డ్రాఫ్ట్ ప్రకారం పాలకుల వయోపరిమితిని 70 నుంచి 75ఏళ్లకు పెంచాలని ప్రతిపాదించారు. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందినట్లయితే..జాతీయ క్రీడా సమాఖ్యలకు అన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది.బీసీసీఐ కూడా ఎన్ఎస్ఎఫ్ కావడంతో చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిబంధనల్లో కూడా ఎక్కడా వయోపరిమితులను విధించలేదు. ఇలా చూస్తే బోర్డు అధ్యక్షుడిగా బిన్నీ మరో 5ఏళ్లు కొనసాగే అవకాశం ఉంటుంది. ఇదే విషయంపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, న్యాయనిపుణులతో బిన్నీ ఈపాటికే చర్చించినట్లు తెలుస్తోంది. మరోవైపు బోర్డులో చక్రం తిప్పగల పెద్దలు కూడా మరో 3ఏళ్లు బిన్నీనే కొనసాగించాలని భావిస్తున్నారట. కొందరు మాత్రం కొత్త బిల్లు వచ్చేంత వరకు శుక్లాకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలనుకుంటున్నారట.

## టీమిండియాకి మరో ఫ్రంట్ లైన్ బౌలర్ అవసరం

### భారత వెటరన్ క్రికెటర్ రహానే వ్యాఖ్య



ఇంగ్లాండ్ తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో భారత్ ప్రస్తుతం వెనుకంజలో ఉన్న సంగతి తెలిసిందే. ఐదు మ్యాచ్ ల ఈ సిరీస్ లో ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. అయితే ఈనెల 23 నుంచి మాంచెస్టర్ లో జరిగే నాలుగో టెస్టులో విజయం సాధించాలంటే టీమిండి యాలో కచ్చితంగా ఒక బిగ్ మార్పు జరగాల్సిందేనని వెటరన్ భారత క్రికెటర్ అజింక్య రహానే వ్యాఖ్యానించాడు. ముఖ్యంగా బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని పేర్కొన్నాడు. మూడో టెస్టులో ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లను పెట్టుకుని 193 పరుగుల టార్గెట్ ను ఛేదించలేక టీమిండియా చతికిలపడింది. ముఖ్యంగా ముగ్గురు ఆల్ రౌండర్లతో ఆడటంతో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ లోనూ అంతగా సత్తా చాట లేక పోయింది. అందుచేత బౌలింగ్ విభాగాన్ని పటిష్టం చేసినట్లయితే బాగుంటుందని పేర్కొన్నాడు. భారత ప్లేయింగ్ లెవన్ లో కీలక మార్పు చేయాలని రహానే సూచించాడు. ముఖ్యంగా ఫ్రంట్ లైన్ బౌలర్ ను మరొకరిని ఆడించాలని పేర్కొన్నాడు. బ్యాటింగ్ లో విఫలమవుతున్న నితీశ్ రెడ్డి స్థానంలో ఏస్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ను ఆడించాలని సూచించాడు. ఇంగ్లాండ్ లో 20 వికెట్లను త్వరగా తీయగలిగితేనే విజయం సాధించే అవకాశముందని, మూడో టెస్టులో కేవలం ముగ్గురు మాత్రమే ఫ్రంట్లైన్ బౌలర్లు జస్ ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ లతో మాత్రమే ఆడింది. నితీశ్ తోపాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ లను ఆడించింది. అయితే వీరు ముగ్గురు బ్యాటింగ్ ఆల్ రౌండర్లే కావడం విశేషం.భారత హెడ్ కోచ్ గౌతం గంభీర్ కు ఆల్ రౌండర్లపై మక్కువ ఎక్కువ. అందుకే జట్టులో ముగ్గురు ఆల్ రౌండర్లు ఉన్నారని తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురిలో నితీశ్ బౌలింగ్ లో ఫర్వాలేదనిపిస్తుండగా, బ్యాటింగ్ లో తేలిపోయాడు. అటు జడేజా బ్యాటింగ్ లో ఆకట్టుకుంటున్నప్పటికీ, బౌలింగ్ లో అంతగా రాణించడం లేదు. ఇక సుందర్.. మాత్రం రెండు విభాగాల్లో ఉనికి చాటుకున్నాడు. దీంతో నాలుగో టెస్టులో టీమిండియా కూర్పుపై సందిగ్ధత ఏర్పడింది. ఈ క్రమంలో పలువురు మాజీలు పలు రకాలుగా సలహాలు ఇస్తున్నారు. ఇక రెండో టెస్టులో ఓడిన ఇంగ్లాండ్ అద్భుతంగా పుంజుకుని, విజయం సాధించిందని రహానే ప్రశంసించాడు. ముఖ్యంగా జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ వంద శాతం ఎఫర్ట్ను అన్ని విబాగాల్లో, మ్యాచ్ అంతటా కొనసాగించాడని పేర్కొన్నాడు. ముఖ్యంగా రిషభ్ పంత్ రనౌట్ విషయం ఈ విషయాన్ని నిరూపిస్తుందని పేర్కొన్నాడు. ఇక నాలుగో టెస్టులో గెలిచి, సిరీస్ నెగ్గాలని ఇంగ్లాండ్ సమరోత్సాహంతో ఉంది. మరోవైపు ఈ మ్యాచ్ లో ఇరుజట్లు తప్పనిసరిగా పలు మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది. స్పిన్నర్ షోయబ్ బషీర్ గాయపడటంతో అతని స్తానంలో మరో ఆటగాడిని ఇంగ్లాండ్ ఆడించబోతోంది. ఇక భారత్ కూడా మరో ఎగస్ట్రాబౌలర్ తో ఆడే అవకాశముంది. అలాగే వంసగా విఫలం అవుతున్న కరుణ్ నాయర్ పై కూడా వేటు పడవచ్చు.

## రిషబ్ పంత్ అంటే ఇంగ్లండ్ జట్టుకు కూడా భయం




ఇండియా, ఇంగ్లండ్ జట్ల మధ్య సిరీస్‌లో నాలుగో మ్యాచ్ జులై 23 నుంచి మాంచెస్టర్‌లో జరగనుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్ ఎలా ఉంటుందనేది పెద్ద ప్రశ్నగా మారింది. గత మ్యాచ్‌లో వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ వేలికి గాయం కావడంతో అతను వికెట్ కీపింగ్ చేయలేకపోయాడు. ఇప్పుడు మాంచెస్టర్‌లో రిషబ్ పంత్ ఆటపై ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా ప్రదర్శన చాలా అద్భుతంగా ఉంది. అయితే టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్ జట్టు ఈ ముగ్గురితో కాదు.. మరో భారత ఆటగాడికి భయపడుతుందని అన్నారు. స్టార్ స్పోర్ట్స్‌తో సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. "పరిస్థితి ఎలా ఉన్నా రిషబ్ పంత్ తన శైలితో ఆడతాడు. అతనికి ఆ స్వేచ్ఛ ఇవ్వాలి. ఐదో స్థానంలో రిషబ్ పంత్ ప్రస్తుతం అతిపెద్ద ఆటగాడు. ప్రస్తుతం రిషబ్ పంత్ ఇంగ్లండ్ జట్టుకు కూడా భయం కలిగించే ఆటగాడు. మరోవైపు బ్యాటర్లు మంచి ప్రదర్శన చేయాలి. యశస్వి జైస్వాల్ తన ఫామ్‌ను సద్వినియోగం చేసుకోవాలి. గత మ్యాచ్‌లో ఎలా ఔటయ్యాడో ఆలోచించాలి?" అని సంజయ్ మంజ్రేకర్ అన్నారు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గురించి సంజయ్ మంజ్రేకర్ మాట్లాడుతూ.. "శుభ్‌మన్ గిల్ పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. లార్డ్స్‌లో గిల్ విఫలమైనప్పటికీ టీమిండియా బ్యాటింగ్ బాగానే ఉంది. టీమిండియా బ్యాటింగ్ పూర్తిగా శుభ్‌మన్ గిల్‌పై ఆధారపడకపోవడం మంచి విషయం." అని ఆయన అన్నారు.ఈ టెస్ట్ సిరీస్‌లో రిషబ్ పంత్ మంచి ఫామ్‌లో కనిపిస్తున్నాడు. ఇప్పటివరకు 6 ఇన్నింగ్స్‌లలో రిషబ్ పంత్ బ్యాట్ నుంచి 425 పరుగులు వచ్చాయి. లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ రిషబ్ పంత్ 74 పరుగులు చేశాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ త్వరగా ఔటయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ కీపింగ్ చేస్తున్నప్పుడు రిషబ్ పంత్ వేలికి గాయం అయింది. రెండో ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ వికెట్ కీలకమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ కూడా పేర్కొన్నాడు. రిషబ్ పంత్‌కు మ్యాచ్ గమనాన్ని ఎప్పుడైనా మార్చగల సామర్థ్యం ఉంది. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో రిషబ్ పంత్ బ్యాట్ నుంచి అద్భుతమైన సెంచరీ వచ్చింది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు రిషబ్ పంత్ పూర్తిగా ఫిట్‌గా ఉండాలని టీమిండియా, అభిమానులు కోరుకుంటున్నారు. ఈ కీలక మ్యాచ్‌లో రిషబ్ పంత్ ఆడటం చాలా అవసరం, ఎందుకంటే నాలుగో టెస్ట్ మ్యాచ్‌ను గెలిచి టీమిండియా సిరీస్‌ను 2-2తో సమం చేయాలని చూస్తోంది.

## సొంతగడ్డపై అదరగొట్టిన బంగ్లాదేశ్


### 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను మట్టికరిపించిన బంగ్లాదేశ్

సొంతగడ్డపై బంగ్లాదేశ్ అదరగొట్టింది. ఇటీవల శ్రీలంకతో టీ20 సిరీస్ నెగ్గిన బంగ్లా తాజాగా పాకిస్థాన్?తో సిరీస్‌ను కూడా ఘనంగా ఆరంభించింది. మూడు టీ20ల సిరీస్?లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్?లో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో పాకిస్థాన్?ను మట్టికరిపించింది. దీంతో బంగ్లాదేశ్ సిరీస్?లో లీడ్?లోకి దుసుకెళ్లగా, పాకిస్థాన్ ఖాతాలో అత్యంత చెత్త రికార్డు చేరింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 19.3 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. బంగ్లా బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు విలవిల్లాడారు. ఓపెనర్ ఫకర్ జమాన్ (44 పరుగులు) టాప్ స్కోరర్. ఈ మ్యాచ్?లో పాకిస్థాన్?లో ముగ్గురు బ్యాటర్లే రెండంకెల స్కోర్ సాధించారు. మిగతా ప్లేయర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఈ క్రమంలోనే పాక్ చెత్త రికార్డు నమోదు చేసింది. టీ20 చరిత్రలో తొలిసారి బంగ్లాదేశ్ చేతిలో ఆలౌట్ అయ్యింది.గతంలో పాకిస్థాన్- బంగ్లాదేశ్ ఈ మ్యాచ్ కాకుండా 22సార్లు టీ20 ఫార్మాట్?లో తలపడ్డాయి. ఇందులో అత్యధికంగా పాక్ 19సార్లు నెగ్గగా, బంగ్లాదేశ్ 3 మ్యాచ్?ల్లో విజయం సాధించింది. కానీ గతంలో పాక్?ను బంగ్లాదేశ్ ఎప్పుడు కూడా ఆలౌట్ చేయలేదు. పాక్ జట్టులోని పదికి పది వికెట్లు నేలకూల్చడం బంగ్లాదేశ్?కు ఇదే తొలిసారి కావడం విశేషం.మ్యాచ్ విషయానికొస్తే, ఛేదనలో బంగ్లాకు కూడా పాక్ గట్టి షాక్ ఇచ్చింది. 7 పరుగులకే రెండు కీలక వికెట్లు పడగొట్టి మ్యాచ్‌పై ఆసక్తి పెంచింది. బౌలర్ సల్మాన్ మిర్జా తంజీద్ హసన్ తమిమ్ (1), లిట్టన్ దాస్ (1)ను పెవిలియన్ పంపి పాక్?కు బ్రేక్ ఇచ్చాడు. కానీ, పర్వేజ్ హొసన్ (56 పరుగులు), తౌహిత్ హ్రిదయ్ (36) బంగ్లాను ఆదుకున్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 73 పరుగులు జోడించి మ్యాచ్‌ను తమవైపునకు తిప్పుకున్నారు

12.3 ఓవర్ వద్ద హ్రిద య్ ఔటైనా, జెకర్ అలీ (15)తో కలిసి పర్వేజ్ మ్యాచ్ పూర్తి చేశాడు. 110 పరుగుల లక్ష్యాన్ని బంగ్లాదేశ్ 15.3 ఓవర్లలోనే అందుకుంది. హాఫ్ సెంచరీతో అదరగొట్టి, నాటౌట్?గా నిలిచిన పర్వేజ్ హొసన్?కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. తాజా విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో బంగ్లా 1-0తో లీడ్‌లోకి దూసుకెళ్లింది. ఇరుజట్లు మధ్య రెండో టీ20 మ్యాచ్ మంగళవారం (జూలై 22)ఢాకా వేదికగా జరగనుంది.

## అఫ్రిది తన వంకర బుద్ధిని బయటపెట్టాడు

ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ రెండవ సీజన్ జూలై 18న ప్రారంభమైంది. ఈ ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ సిరీస్‌లో భారత్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జూలై 20న జరగాల్సింది. కానీ ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని దృష్టిలో ఉంచుకుని భారత ఆటగాళ్ళు ఈ మ్యాచ్ ఆడటానికి నిరాకరించారు. అంతేకాదు ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని డిసైడ్ అయ్యారు. దీంతో యాజమాన్యం భారత జట్టు ముందు తలవంచాల్సి వచ్చింది. చివరికి మ్యాచ్‌ను రద్దు చేయాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ రద్దుకు ప్రధాన కారణాల్లో ఒకటి పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది. కొంతకాలం క్రితం అఫ్రిది సోషల్ మీడియాలో భారత్ పై విషం కక్కాడు. ఈ ఛాంపియన్ జట్టులో అఫ్రిది కూడా ఉన్నారు. అయితే ఈ మ్యాచ్ రద్దైన తర్వాత మరోసారి స్పందించారు అఫ్రిది. భారత్, పాకిస్తాన్ మధ్య జరగనున్న ఈ మ్యాచ్ గురించి షాహిద్ విషం కక్కాడు. ఈ మ్యాచ్ రద్దుతో భారత జట్టులోని చాలా మంది ఆటగాళ్లు కూడా నిరాశ చెందారని, జట్టులోని ఒక ఆటగాడి కారణంగా వారు ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ఆరోపణలు చేశారు. విలేకరుల సమావేశంలో భారత జట్టు కూడా ఈ మ్యాచ్ ఆడలేకపోవడం పట్ల నిరాశ చెందిందని.. దీనికి భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కారణమంటూ అఫ్రిది వ్యాఖ్యలు చేశారు. ఈ లీగ్‌లో పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో తాను పాల్గొనబోనని శిఖర్ జూలై 11న బహిరంగంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. షాహిద్ అఫ్రిది ధావన్‌ను కుళ్ళిన గుడ్డు అంటూ పిలిచాడు. అతను టీం ఇండియా ఆటగాళ్లను చెడగొట్టాడని కూడా అఫ్రిది ఆరోపించాడు. "క్రీడలు దేశాలను దగ్గర చేస్తాయి. మీరు క్రీడలలోకి రాజకీయాలను తీసుకువస్తే, మీరు ఎలా ముందుకు వెళతారు" అంటూ ప్రశ్నించారు. సంభాషణ లేకుండా ఏదీ సరైనది కాదని, విషయాలను సరిదిద్దడానికి ఇటువంటి మ్యాచ్‌లు నిర్వహిస్తాయని అన్నారు. కానీ ప్రతి అంశాన్ని పాడు చేసే విధంగా మాట్లాడకూడదు. ఇంతటితో అఫ్రిది ఊరుకోలేదు.. అగ్నికి ఆజ్యం పోస్తూ ధావన్ తన దేశానికి ఇబ్బంది కలిగించే వ్యక్తి అంటూ సంచలన ఆరోపణలు చేశాడు. భారత జట్టు ఆడాల్సిన అవసరం లేకపోతే వారు ఇక్కడికి ఎందుకు వచ్చారు. వారు ఇంట్లోనే ఉండి ఉండాలి కదా అంటూ ప్రశ్నించారు. చివరగా అఫ్రిది మాట్లాడుతూ.. దాదాపు అందరు భారత ఆటగాళ్లు మ్యాచ్ కు ముందు శిక్షణ పొందారని అన్నారు. కేవలం ఒకే ఒక్క ఆటగాడి కారణంగానే వారు మ్యాచ్ నుంచి వైదొలిగారని నేను భావిస్తున్నాను. దీనిపై భారత జట్టు కూడా చాలా కోపంగా ఉంది. వారందరూ ఇక్కడ ఆడటానికి వచ్చారు. మీరు దేశానికి మంచి రాయబారిగా ఉండాలని.. ఇబ్బందికి కారణం కాకూడదని నేను మీకు చెప్తున్నాను అంటూ చెప్పుకొచ్చాడు అఫ్రిది.



# వీరమల్లు కోసం చాలా కష్టపడ్డాం


**మూవీని ప్రమోట్చేయడం తెలియదు**

**ఎఫ్‌డిసి చైర్మన్‌గా రత్నం పేరు సిఫారసు**

**సమావేశంలో పవన్ కళ్యాణ్ వెల్లడి**

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'హరి హర వీరమల్లు' మూవీ జులై 24న పాన్ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈసందర్భంగా టీమ్ స్పెషల్ ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఇందులో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. పోడియం లేకుండా మాట్లాడటం కష్టంగా ఉందని నవ్వుతూ పవన్ తన స్పీచ్‌ను ప్రారంభించారు. నా జీవితంలో సినిమాపరంగా మీడియాతో మాట్లాడడం ఇదే తొలిసారి. సినిమాను ఎలా ప్రమోట్ చేసుకోవాలో నాకు తెలియదు. దీనికోసం ఇంత కష్టపడ్డాం అని చెప్పడం నాకు మొహమాటంగా ఉంటుంది. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నా ఫొటోలు కూడా పేపర్లో వేయలేదు. దీంతో పబ్లిసిటీ లేకుండానే నా సినిమాలు రిలీజ్ అయ్యాయి. సినిమా గురించి నాకు ఏం మాట్లాడాలో తెలియదు. . సినిమాను తెరకెక్కించాలంటే ఎన్నో యుద్ధాలు చేయాలి. మన చిత్ర పరిశ్రమని పాన్ఇండియా స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి రత్నం. ఈ సినిమా చాలా ఒడుదొడుకులు ఎదుర్కొంది. నేను పాలిటిక్స్‌కు వెళ్లిపోయిన తర్వాత సినిమాకు -టైం ఇవ్వలేకపోయాను. అయినప్పటికీ నా బెస్ట్ ఇచ్చాను. గతంలో నేను నేర్చుకున్న మార్షల్‌ఆర్ట్స్ ఈ సినిమాకు ఎంతో పనికి వచ్చిందని పవన్ వివరించారు. ఈ సినిమాకు క్లైమాక్స్ ఆయువుపట్టు-. కోహినూర్ వజ్రం చుట్టూ కథ తిరుగుతుంది. క్రిష్ చాలా మంచి కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారు. ఆయనకు మా టీమ్ అందరి తరఫున కృతజ్ఞతలు. ఒక్కోసారి ఇండస్ట్రీ చాలా కఠినంగా ఉంటుంది. రత్నం ఎంతో ముందుచూపు ఉన్న నిర్మాత. ఆయన ఈ సినిమా కోసం ఎంతో నలిగిపోయారు. ఈ సినిమా పూర్తవుతుందా, లేదా? అని అనుకున్నప్పుడు దీనికి కీరవాణి ప్రాణం పోశారు. ఒక్కోసారి డబ్బులు, సక్సెస్ కోసం కాదు ఇండస్ట్రీ బాగుకోరే వ్యక్తుల వెంట నిలవడం ఎంతో ముఖ్యం. అందుకే ప్రత్యర్థులు తిడుతున్నా ఈ మీటింగ్‌కు వచ్చాను. ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా రత్నం పేరును ప్రతిపాదించాను. నాకు సినిమా అన్నం పెట్టింది. సినిమా అంటే నాకు ప్రాణవాయువుతో సమానం అని పవన్ తెలిపారు. మన ప్రభుత్వం చిత్రపరిశ్రమను ఎంతో ఆదరిస్తోంది. అందుకే ఈ సినిమా ప్రచారంలో భాగం కావాలని వచ్చాను. చిరంజీవి కుమారుడైనా, తమ్ముడైనా ఎవరైనా టాలెంట్ లేకపోతే నిలబడలేరు. రేపు నా కుమారుడైనా అంతే. ఇక్కడ ప్రతిభే ముఖ్యం అని పవన్ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం తెల్లవారుజామున 2 గంటలకు లేచి కష్టపడేవాడిని. జ్యోతికృష్ణ ఎంతో సత్తా ఉన్న దర్శకుడు. ఈ సినిమా ఫలితం పూర్తిగా ప్రజల చేతిలో ఉంటుంది. మిగతా వారితో పోలిస్తే నేను కొన్ని పనులు చేయలేను. సుస్వాగతం సినిమాలో బస్సు మీద ఎక్కి డ్యాన్స్ చేయమన్నారు. నేను చేయలేక చచ్చిపోయా. యాక్షన్ సీక్వెన్స్ కూడా మార్షల్ ఆర్ట్స్ చేశా కాబట్టి అవగాహన ఉంది. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అని వేరు చేయడం నాకు నచ్చదని పవన్ అన్నారు. ఈ సినిమాలో 20 నిమిషాల ఫైట్ సన్నివేశానికి పవన్‌కల్యాణ్ కొరియోగ్రఫీ చేశారని దర్శకుడు జ్యోతికృష్ణ చెప్పారు. పవన్‌తో నటించే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు- నటి నిధి అగర్వాల్ అన్నారు.






## పెద్ది మూవీ కోసం రామ్ చరణ్ కసరత్తులు

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పెద్ది' సినిమా కోసం అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తున్నారు. ఇందులో చరణ్ డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా కోసం తాను వర్క్‌వుట్స్ చేస్తున్నట్లు- తెలుపుతూ రామ్ చరణ్ ఓ ఫొటో షేర్ చేశారు. ప్రస్తుతం అది వైరల్ అవుతోంది. జిమ్‌లో వర్క్‌వుట్స్ చేస్తోన్న ఫొటోను షేర్ చేసిన ఆయన ..'పెద్ది కోసం మారుతున్నాను ఇలా.. దృఢమైన సంకల్పం.. గొప్ప ఆనందం' అనే క్యాప్షన్ పెట్టారు. దీంతో ఆయన న్యూలుక్ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ 'పెద్ది' గ్లింప్స్‌లోని కొన్ని సన్నివేశాలతోనే పాన్ ఇండియా స్థాయిలో సినిమాపై ప్రత్యేకమైన ఉత్సుకతని రేకెత్తించింది చిత్రబృందం. అందుకు దీటుగానే బుచ్చిబాబు సినిమాని రూపొందిస్తున్నారు. తాజాగా చెర్రీ లుక్‌తో ఆ అంచనాలు మరింత పెరిగాయి.



## ఆలియా ఇంతకుముందు ఎన్నడూ లేనంతగా!



కొత్త కుర్రాడు అహాన్ పాండే -కొత్తమ్మాయి అనీత్ పద్దా జంటగా నటించిన -సైయ్యారా- ఈ ఏడాది బెస్ట్ ఓపెనర్ గా రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాపై సెలబ్రిటీలు ప్రశంసలు కురిపించారు. ఈ అద్భుత ప్రేమకథా చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించారు. ఆషికీ 2, ఏక్ విలన్ తర్వాత మోహిత్ కెరీర్ బెస్ట్ హిట్ చిత్రంగా ఇది నిలిచింది. సయ్యారాపై ఇంతకుముందు టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో నటించిన డెబ్యూ నటులను, మోహిత్ సూరిని ఆయన ప్రశంసించారు. ఈ సినిమా చూసిన తర్వాత అగ్ర కథానాయిక అలియా భట్ తన ఇన్‌స్టాలో ఒక నోట్ రాసింది. అహాన్ - అనీత్ నటనపై అలియా ప్రశంసల వర్షం కురిపించింది. "ఇద్దరు అందమైన తారలు పుట్టారు. నేను చివరిసారిగా ఇద్దరు నటులను ఇంత విస్మయంతో ఎప్పుడు చూశానో గుర్తులేదు. నా కళ్ళలో నక్షత్రాలతో.. మీ కళ్ళలోని నక్షత్రాలను చూస్తున్నాను. మీరిద్దరూ ఇంత గొప్ప వ్యక్తిత్వంతో.. ఇంత నిజాయితీతో ప్రకాశిస్తున్నారు.. నేను మిమ్మల్ని మళ్ళీ మళ్ళీ చూడగలను. నిజాయితీగా చెప్పాలంటే.. నేను మళ్లీ ఈ సినిమా చూస్తాను!" అంటూ ఆలియా వ్యాఖ్యానించింది. ఈ సినిమాను తెరకెక్కించిన మోహిత్ సూరి పైనా ఆలియా ప్రశంసలు కురిపించింది. ఎంతటి గొప్ప అనుభూతి..ఎంతటి అద్భుత సంగీతం! సినిమాలు మాత్రమే మీకు ఇలాంటి అనుభూతినిస్తాయి. సైయారా హృదయంతో, ఆత్మతో నిండి ఉంది. మీతో ఎప్పటికీ నిలిచి ఉంటుంది. అందమైన సృష్టికి అభినందనలు. ఇది కేవలం సినిమా కాదు.. అంటూ ప్రశంసల వర్షం కురిపించింది ఆలియా.

## డేంజర్ లో శ్రీలీల కెరీర్..?

ధమాకా బ్యూటీ శ్రీలీల కెరీర్ డేంజర్ జోన్ లో ఉందా అంటే అవుననే చెప్పాలి. ఎందుకంటే శ్రీలీల సినిమాలు మొదలో సక్సెస్ అందుకున్నాయి కానీ రాను రాను ఆమె సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి ఫలితాలు ఇవ్వట్లేదు. తన డాన్స్ ఎనర్జీతో మెప్పిస్తున్నా కూడా ఎందుకో శ్రీలీల సినిమాలు సూపర్ హిట్ అవ్వట్లేదు. శ్రీలీల రీసెంట్ గా జూనియర్ సినిమాతో వచ్చింది. ఆ సినిమాలో కిరీటికి జతగా నటించింది శ్రీలీల. వైరల్ వయ్యారి సాంగ్ తో జూనియర్ సినిమా చూసేందుకు బజ్ తెచ్చినా కూడా సినిమా మాత్రం మొదటి షో నుంచే రొటీన్ సినిమా అనే టాక్ తెచ్చుకుంది. ఐతే ఈ సినిమాలో శ్రీలీల రోల్ కేవలం డాన్స్ ల వరకే అనేలా ఉంది. శ్రీలీల సినిమాలో ఉంటే సాంగ్స్ సూపర్ హిట్.. డాన్స్ లు దద్దరిల్లిపోతాయి. కానీ సినిమాల్లో మాత్రం అంత స్టఫ్ ఉండట్లేదు. గుంటూరు కారం సినిమా తర్వాత శ్రీలీల పెద్దగా సినిమా ఆఫర్లు అందుకోలేదు. వరుస ఫ్లాపులు ఆమె కెరీర్ ని రిస్క్ లో పడేస్తున్నాయి. కేవలం డాన్స్ లు, సినిమాకు ఉపయోగపడని సీన్స్ ఉన్నంత మాత్రాన హీరోయిన్ కి క్రేజ్ వస్తుందని చెప్పడం కష్టం. మరి శ్రీలీల ఎందుకు స్టోరీ సెలక్షన్ లో అంత తొందరపడుతుందని అనుకుంటున్నారు. కేవలం రెమ్యునరేషన్ ల కోసమే అయితే ఇలానే కెరీర్ మూడు నాళ్ల ముచ్చట అవుతుంది. అలా కాకుండా కాస్త కథాబలం ఉన్న సినిమాలు, పాత్రలు చేస్తేనే శ్రీలీల కొన్నాళ్లు సినిమాలు చేయగలుగుతుంది. జూనియర్ శ్రీలీల ఫాలోవర్స్ ని కూడా డిజప్పాయింట్ చేసింది. ఇక అమ్మడు ప్రస్తుతం మాస్ మహారాజ్ తో మాస్ జాతర సినిమా చేస్తుంది. ఆ సినిమాతో అయినా హిట్ కొడుతుందేమో చూడాలి. ఇదే కాదు శ్రీలీల పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కూడా నటిస్తుంది. హరీష్ శంకర్ డైరెక్షన్ లో వస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. అది ఎలాగు పవర్ స్టార్ సినిమా కాబట్టి దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. శ్రీలీలను మళ్లీ సరైన ట్రాక్ లో పెట్టే బాధ్యత రవితేజ, పవన్ కళ్యాణ్ సినిమాలు తీసుకున్నాయి. ఆ రెండు సినిమాలు సక్సెస్ అయితే మళ్లీ శ్రీలీల తెలుగులో దూకుడు పెంచే అవకాశం ఉంటుంది.

## లక్కీ భాస్కర్ అనుకున్న విజయం సాధించలేదు

**నిర్మాత నాగవంశీ వెల్లడి**

విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటించిన 'కింగ్‌డమ్' సినిమా జూలై 31న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ప్రస్తుతం ప్రమోషన్లలో బిజీగా ఉన్న నిర్మాత నాగవంశీ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన గత చిత్రాల ఫ్లాప్‌ల గురించి ఓపెన్ అయ్యారు. నాగ వంశీ మాట్లాడుతూ.. ' 'లక్కీ భాస్కర్' సినిమాకు నేను ఊహించినంత వసూళ్లు రాలేదు. అలాగే 'గుంటూరు కారం'పై వచ్చిన ట్రోలింగ్ నాకు ఇంకా అర్థం కావడం లేదు. కానీ నేను తెలిసి చేసిన తప్పు 'రణరంగం'. శర్వానంద్ లవర్ బాయ్ ఇమేజ్ ఉన్న సమయంలో వయసున్న పాత్ర చేయించడం అంత మంచిదేం కాదు అని బాబాయ్ గారు హెచ్చరించారు. అయినా మేము కొత్తగా ప్రయత్నించాలనుకున్నాం. అది వర్కౌట్ కాలేదు. కానీ అది పూర్తిగా ఫెయిల్ అయింది. బహుశా ఆ పాత్రను రవితేజ వంటి వాళ్లు చేసిన, హిట్ అయ్యేదేమో. అలాగే 'ఆదికేశవ' సినిమా విషయంలో కూడా పెద్ద తప్పు చేశా. రిపేర్ చేయాలని ప్రయత్నించిన కుదర్లేదు. ఈ రెండు సినిమాలు నా కెరీర్‌లో చాలా ఖరీదైన తప్పులుగా మిగిలిపోయాయి' అని ఆయన గుర్తు చేసుకున్నారు. తన తప్పులను నిస్సందేహంగా అంగీకరించి, తద్వారా భవిష్యత్తులో మంచి నిర్ణయాలు తీసుకోవాలన్న ప్రయత్నం చేస్తున్న నాగవంశీ మాటలు ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు, సినీ వర్గాలు ఆయన నిజాయతీని మెచ్చుకుంటున్నారు.

## 50లో 20 ఎలా పాజిబుల్ మలైకా మ్యామ్?

బికినీ బీచ్ విహార యాత్రలతో తన ఇన్ స్టా అభిమానులకు ట్రీట్ ఇవ్వడంలో మలైకా ఎప్పుడూ వెనకాడదు. ఇటీవల కొంత కాలంగా టస్కానీ యాత్ర నుంచి రకరకాల ఫోటోషూట్లను మలైకా షేర్ చేయగా అవన్నీ వైరల్ గా మారాయి. ఇప్పటికీ మలైకా అరోరా టస్కానీ డైరీస్ నుంచి చిల్లింగ్ ఫోటోషూట్లు వెబ్ ని ముంచెత్తుతున్నాయి. మల్లా చిల్ వైబ్స్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. మలైకా అరోరా కొద్దిరోజులుగా తన కుమారుడు అర్హాన్ ఖాన్‌తో కలిసి టస్కానీ బీచ్ లలో సెలవులను గడుపుతోంది. వెకేషన్ లో ఆస్వాధనకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టడం లేదు. కుమారుడు అర్హాన్ తో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను షేర్ చేసిన 51 ఏళ్ల మలైకా.. వాటితో పాటు వరుసగా బికినీ, స్విమ్ సూట్లలో ఉన్న ఫోటోషూట్లను కూడా షేర్ చేస్తుంటే అవన్నీ వెబ్ లో సునామీ సృష్టిస్తున్నాయి.

51 వయసులో ఇంతటి అందం, వేడి ఎలా సాధ్యం మ్యాడమ్ ? యాభైలో ఇరవై చూపిస్తున్నారు! అంటూ అభిమానులు ఈ ఫోటోషూట్లపై కామెంట్ చేస్తున్నారు. తాజాగా మలైకా ఓ యూనిక్ ఫోటోషూట్ ని షేర్ చేసింది. ఈసారి పింక్ బికినీలో దుమారం రేపింది. మలైకా టూపీస్ బికినీ స్పెషల్ గా ఎలివేట్ అవ్వడంతో ఇది క్షణాల్లో వెబ్ లో వైరల్ గా మారింది. అందమైన బీచ్ రిసార్ట్, చుట్టూ బులుగు సముద్రం, అక్కడ మలైకా రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ యూత్‌లో దుమారం రేపుతోంది. టస్కానీ టూర్ ముగించాక తిరిగి మలైకా తన రియాలిటీ షో వ్యవహారలతో బిజీ అవుతుంది.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463